# బడిబాటలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

## ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను తెలియజేస్తూ ర్యాలీ

**మంగళగిరి, ఏప్రిల్ 10, (ప్రభాతవార్త :** బడిబాట కార్యక్రమం లో భాగంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పాత బ్యాంక్ కాలనీ నందు గల ముస్సిపల్ యు పి




స్కూల్ ఉపాధ్యాయులు శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్సి ఎం స్కూలు, ముస్సిపల్ ఉర్దూ స్కూలు, అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్చాలని కోరారు. ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న యూపీ స్కూల్ విద్యార్థులు ఎక్కడికో ఎందుకు దండగ మన దగ్గరలో ప్రభుత్వ బడి ఉండగా సర్కారు బడి సకల సౌకర్యాలకు గుడి ప్రభుత్వ బడిలో చేర్చండి మీ ఆదాయాన్ని పొదుపు చేసుకోండి. అంటూ రూపొందించిన నినాదాలు చేస్తూ, చైతన్య ర్యాలీలో ముందుకు సాగారు. ఒకటవ తరగతి 8వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి చిన్న అంకారావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి ఉచితంగా నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంటీఎంసి కేకే హై స్కూల్ హెచ్ఎం నాగార్జున, ఆర్.సి.యం పాఠశాల హెచ్ఎం ఆనందమేరి, ఉర్దూ స్కూల్ హెచ్ఎం మోనిక, టి శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, కే సూరిబాబు, శ్రీదేవి, సిహెచ్ లక్ష్మీ తిరుపతమ్మ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

# చిన్న సినిమాకి సబ్సిడీ పెంచాలి : దర్శకుడుదిలీప్ రాజా



**తెనాలి టౌన్ ఏప్రిల్10,(ప్రభాతవార్త):** తెలుగు రాష్ట్రాల్లో పెద్ద సినిమాకు గ్రాస్ కలెక్షన్ 200 కోట్లు వస్తే అందులో నిర్మాతకు మిగిలేది 84 కోట్లేనని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ ( మా ఎపి) వ్యవస్థాపకులు సినీదర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. అయితే ఈవాస్తవం ప్రజలకు తెలియక డబ్బులు గోతాల్లో మిగిలాయనే అపోహ లున్నాయని ఆయన పేర్కొన్నారు. స్థానిక మాఎపి కార్యాల్నయలో శుక్రవ్నార ఏర్పాటు చేసిన మీడియ సదస్సులో మాట్లాడుతు ఇక చిన్న సినిమాల పరిస్థితి ప్రశ్నార్థకరమేనన్నారు. 18 జీఎస్టీకి 36 కోట్లు, 25 థియేటర్ల రెంటులకు 50 కోట్లు, 20 డిస్ట్రిబ్యూటర్లకు 25 కోట్లు పోగా నిర్మాత కు 84 కోట్లు నికర ఆదాయం మిగిలుతుందని ఆయన వివరించారు. అయిదుగురు హీరోల సినిమాలకు టిక్కెట్లు రేట్లు పెంచడంవలన కొంతమేరకు నిర్మాతలకు ఊరట కలిగిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ అంశాలను తెలుగు రాష్ట్రాలు పరిగణలోకి తీసుకుని చిన్న సినిమాలకు సబ్సిడి పెంచవలసిందిగా దిలీప్ రాజా రెండూ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# వెరికోస్ వీన్స్ రోగులకు ఉచిత వైద్యశిబిరం

**తెనాలి టౌన్ ఏప్రిల్10,(ప్రభాతవార్త):** బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం మండల కేంద్రం అమృతలూరులో ఏప్రిల్ 12న ఆదివారం ఉచిత



వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ (తెనాలి) ఈదర వెంకట పూర్ణచంద్ తెలిపారు. అమృతలూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వెరికోస్ వీన్స్ సమస్య లపై వైద్య సేవలు అందిస్తారని వివరించారు. సుశ్రుత పౌండేషన్,ఏషియన్ వాస్క్యులర్ హస్పటల్ సౌజన్యంతో,మైనేని రత్న ప్రసాద్,ఈదర వెంకట పూర్ణ చంద్,ఉప్పల సాంబశివరావు, కూచిపూడి సతీష్ కుమార్, పర్వతనేని భాను ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు .అమృతలూరు లోని మండల పెన్షనర్ల భవనంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. కాళ్ళ వాపులు,నరాల వాపులు,కాళ్లపై పుండ్లు,అరికాళ్ళ వాపులు, దురదలు,మంటలకు వైద్య పరీక్షలు నిర్వహించబడునన్నారు. ఈ వైద్య శిబిరంలో నాలుగు వేలరూపాయల విలువైన వ్యాస్కులర్ సర్జన్ కన్సల్టేషన్,కలర్ డోప్లర్ స్క్రీనింగ్ టెస్ట్ ఉచితంగా పొందవచ్చు అన్నారు.అవసరమైన వారికి ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్ తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించి మరల ఇక్కడకు తీసుకొస్తారని తెలిపారు (తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి).మండల గ్రామాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సమావేశంలో మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, ఉప్పల సాంబశివరావు, వెలగపూడి జానకి రామయ్య,బొల్లు సూర్యనారాయణ,హాస్పిటల్ ఏరియా కోఆర్డినేటర్, మధు,షేక్.రంజానీ పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ చొరవతో చిలువూరులో

# డ్రైన్ సైడ్ వాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన

**దుగ్గిరాల, ఏప్రిల్10,(ప్రభాతవార్త):** మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి దిశగా మంత్రి నారా లోకేష్ చొరవతో కీలకమైన మరో అభివృద్ధి పనికి శ్రీకారం చుట్టారు.దుగ్గిరాల మండలం చిలువూరు–తుమ్మపూడి గ్రామాల మధ్య రూ.1 కోటి 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న “కన్స్ట్రక్షన్ ఆఫ్ రిటైనింగ్



వాల్ ఆన్ ఓల్డ్ టీబీ డ్రైన్” పనులకు శుక్రవారం నాయకులు శంకుస్థాపన చేశారు.మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి నిధులు ద్వారా మంజూరైన ఈ పనిలో భాగంగా 234 మీటర్ల పొడవున డ్రైన్ సైడ్ వాల్స్ నిర్మాణం చేపట్టనున్నారు.ఈ పనులు పూర్తయిన అనంతరం పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపశమనం కలగనుంది. ఈ సందర్భంగా దుగ్గిరాల మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉన్నం ఝాన్సీ రాణి, ఎంపీపీ జబిన్ లు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని,మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినందుకు దుగ్గిరాల మండలం చిలువూరు, తుమ్మపూడి గ్రామస్తులు మంత్రి నారా లోకేష్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మరియ రోజమ్మ,రాష్ట్ర టీడీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి ఎండీ.నిజాముద్దీన్,గుంటూరు పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి మేళం ఆనందమోహన్, దుగ్గిరాల డీసీ చైర్మన్ గొర్నెని అనిల్,నియోజకవర్గ తెలుగురైతు ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డిశ్రీనివాసరావు,వెనిగళ్ళ శ్రీ కృష్ణప్రసాద్,దుగ్గిరాల యార్డ్ డైరెక్టర్ బుస్సా నాగరాజు,జంపాల హరిబాబు, చిలువూరు శేషగిరి,హరి ప్రసాద్,శంకర్ నాయక్, నర్రా శివప్రసాద్, రంగిశెట్టి రమేష్, అధికారులు ఈఈ ప్రేమ్ కుమార్,డిఈఈ అనిల్, ఏఈఈ కిరిటీ తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ నిధుల సవరణ బిల్లును,మతం మారితే ఎస్సీ హోదా రద్దు తీర్పును పరిశీలించాలి

**తెనాలి మున్సిపాలిటీ, ఏప్రిల్10,(ప్రభాతవార్త):** విదేశీ నిధుల నియంత్రణ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం పున పరిశీలించి,ప్రజాస్వామ్య విలువలను,రాజ్యాంగ హక్కులను కాపాడాలని,మతం మారితే ఎస్సీ హోదా రద్దు అన్యాయమని మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు పేర్కొన్నారు.క్రైస్తవ మతం మారితే ఎస్సీ హోదా రద్దు,ఎఫ్సిఆర్ఏ నియంత్రణ సవరణ బిల్లును పున పరిశీలించాలని పట్టణంలోని మార్కెట్ సెంటర్ వద్ద ఎస్ఎన్ఆర్ కార్యాలయంలో శుక్రవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సుద్దపల్లి నాగరాజు మాట్లాడుతూ, విదేశీ నిధుల నియంత్రణ సవరణ బిల్లు పట్ల



కేంద్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతోమంది క్రైస్తవులకు నష్టం కలుగుతుందని,ఈ సవరణ బిల్లుపై కేంద్రం ప్రభుత్వం పున పరిశీలించాలని చెప్పారు. క్రైస్తవ మతం మారితే ఎస్సీ హోదా రద్దు అవుతుందన్న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.మతం మారితే ఎస్సీ హోదా రద్దు అన్యాయమని తెలిపారు.పాస్టర్ మల్లవరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ,ఎస్సీలకు రక్షణ చట్టమైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం,మతం మారిన వారికి వర్తించదన్న నిర్ణయం దుర్మార్గమని ఈ విషయంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోట్ల దిలీప్,లింగాల రమేష్,గుమ్మడి సంపత్ వర్మ,పాస్టర్ ఆనంద్ సునీల్,రాయల వినయ్,తాతపూడి పోతుల రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ లను సద్వినియోగం చేసుకోవాలి : మున్సిపల్ కమీషనర్

**తెనాలి మున్సిపాలిటీ,ఏప్రిల్10,(ప్రభాతవార్త):** తెనాలి ప్రాజెక్ట్ తెనాలి వన్ సెక్టార్ పరిధిలోని 13వ వార్డ్ అంగన్వాడీ కేంద్రంలో 8వ పోషణ పక్కవాడ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన తెనాలి మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మాట్లాడుతూ, పోషన్ పక్వాడా థీమ్ లలో ముఖ్యమైన థీమ్ స్క్రీన్ టైం తగ్గించి శారీరక వ్యాయామాలు క్రీడలు నేర్పిస్తూ పిల్లలను ప్రోత్సహించాలి. ఇంట్లో పెద్దలు కథలు చెబుతూ పుస్తకాలు చదవడం ద్వారా వారిలో ఊహాశక్తిని,ఆసక్తి ని,సృజనాత్మకతను పెంపొందించాలి. వాటి ద్వారా అన్ని నైపుణ్యాలు పెంపొందుతాయి.. అని చెప్పి అంగన్వాడికి పిల్లల్ని పంపించి ఆటపాటల విద్యతోపాటు వారిచ్చే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పినారు. సిడిపిఓ విజయ గౌరీ మాట్లాడుతూ, గర్భిణీలకు వెయ్యి రోజుల సంరక్షణ గురించి గర్భిణీ లు తీసుకోవాల్సిన ఆహారము ప్రసవానంతరం తల్లిపాల ప్రాముఖ్యత,ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం, ఇస్తూ రెండు సంవత్సరాలు వయసు దాకా తల్లిపాలు కొనసాగించాలని అది గోల్డెన్ పీరియడ్ అని అవగాహన కల్పించారు. సున్నా నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు జరిగే మెదడు అభివృద్ధికి మనం ప్రేరణ కలిగిస్తూ వారికి ఉన్న లోపాలు గుర్తించవలెను అని తెలియజేశారు పిల్లలకు అన్నం పెడుతూ కథలు చెప్పడం పాటలు పాడడం లాంటివి చేస్తూ సంభాషిస్తూ వారికి అన్నం తినిపించాలి. కానీ స్క్రీన్స్ చూపిస్తూ, టీవీ చూపిస్తూ అన్నం తినిపించడం వల్ల వారిలో ఆలోచన శక్తి అభివృద్ధి కుంటుపడుతుంది అని మూడు నుంచి ఆరు సంవత్సరాలు వయసు కలిగిన పిల్లలకు జంక్ ఫుడ్ పెట్టడం వల్ల



వాటిలోని సోడియం సాల్ట్ వల్ల హైపర్ టెన్షన్, హార్ట్ కి సంబంధించి సమస్యలు, కిడ్నీలు సమస్యలు,క్యాన్సర్లు, ఊబకాయం,మధుమేహం, వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కావున ఇంట్లో వండిన స్నాక్స్ పిండి వంటలు మన పూర్వీకులు మనకి తెలియజేసిన ఆహార పదార్థాలను వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఇంట్లో వండిన ఆహార పదార్థాల ను పిల్లలకి పెట్టవలెనని సూచించినారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కే సౌజన్య శ్రీ అంగన్వాడీ కార్యకర్త సింధు, హెల్పర్ శోభ గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు తండ్రులు, పాల్గొన్నారు.

# పెదనందిపాడు వరగాని సబ్ స్టేషన్ల పరిధిలో నేడు విద్యుత్ బంద్

**పెదనందిపాడు. ఏప్రిల్ 10, (ప్రభాతవార్త)** శనివారం ఉదయం 8. గంటల నుండి మ 1. గంట వరకూ పెదనందిపాడు సెక్షన్, 33/11రేజు సబ్ స్టేషన్ మరియు 33/11కేవి వరగాని సబ్ స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలలో, 11రేజు విద్యుత్ లైన్ల మరమ్మత్తులు మరియు మైంటెనెన్సు నిమిత్తము విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ పొన్నూరు డి ఈ ఈ అశోక్. పెదనందిపాడు ఏఈ మురళీకృష్ణ లు తెలిపారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు కావున విద్యుత్ వినియోగదారులు సహకరించ వలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం పై అవగాహన

**పెదనందిపాడు, ఏప్రిల్ 10, (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండలం రావిపాడు లో గల హెల్త్ సబ్ సెంటర్ లో శుక్రవారం, పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా, తల్లి మరియు శిశు పోషణ గురించి, గర్భధారణ సమయంలో తీసుకోవలసిన పౌష్టికాహారం, మరియు సంరక్షణ గురించి, గర్భిణీ పరీక్షలు . ఏఎన్సి లా ప్రాముఖ్యత, మరియు బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ప్రారంభించడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించేందుకు వంటల పోటీలు, సరి అయిన వయసులో బిడ్డకు అనుబంధాహారం



ప్రారంభించడం, తదితర అంశాలపై మండల వైద్యాధికారి డాక్టర్ ఎన్ నందకుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండి జరీనా , ఏఎన్ఎం ఏ ప్రభావతి , సిహెచ్ఓ ఏ దివ్య కుమారి,ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, పాల్గొన్నారు

# క్షయ వ్యాధి పూర్తినిర్మూలనే “ముక్త్ భారత్ అభియాన్“లక్ష్యం : తాహసీల్దార్ గోపాలకృష్ణ

**తెనాలి టౌన్, ఏప్రిల్10,(ప్రభాతవార్త):** 2030 నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా భారతదేశం నుండి నిర్మూలించడమే టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రధాన లక్ష్యమని ప్రత్యేక పరిపాలన అధికారి, తెనాలి తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాలానుసారం మండల పరిదిలోని కొవెవరం పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం టిబి ముక్త్



భారత్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తహశీల్దార్ తెలిపారు.రోగాలు సంక్రమించకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని అలాగే పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చన్నారు.టిబి యూనిట్ తెనాలి వైద్య అధికారిని దేవరపల్లి సుభాష్ రమాదేవి మాట్లాడుతూ,టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. క్షయ వ్యాధిని అరికట్టడమే లక్ష్యంగా 100 రోజులపాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా హై రిస్క్ ప్రాంతాలుగా ఎంపిక చేసి రోగులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజులుగా దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్నవారు తప్పకుండా వైద్యులను సంప్రదించాలని సూచన చేశారు.ఈ శిబిరాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి హ్యాండ్ ఎక్రే, కళ్లే, మూత్ర, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మండల అభివృద్ధి అధికారి అత్తోట దీప్తి మాట్లాడుతూ,టిబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా హైరిస్క్ గ్రామాలు, వల్నరబుల్ వర్గాలపై ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కొవెవరం గ్రామంలో నాలుగు టీబీ కేసులను గుర్తించి వారికి వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కొలకలూరు, కోపల్లె గ్రామాల్లో చెరో రెండు టీబీ కేసులు నమోదు అయ్యాయన్నారు.అనంతరం కొలకలూరు పిహెచ్సి డాక్టర్ సిహెచ్ వి సుబ్బారావు,డిడి యు.దిలీప్, టిబి యూనిట్ జిల్లా కోఆర్డినేటర్ వి.రాజశేఖర్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో టిబి యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ రవికుమార్, టిబి హెల్త్ విజిటర్ డాక్టర్ రవి కుమార్, వైద్య సిబ్బంది ఎం.రాజయ్య, ఎం.వెంకటరెడ్డి,కె. ప్రసన్నకుమారి, వి.ఝాన్సీ, ఎంఎన్ హెచ్ పి,ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొలకలూరులో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ప్రత్యేకాధికారి అత్తోట దీప్తి

**తెనాలి టౌన్,ఏప్రిల్10,(ప్రభాతవార్త):** తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి ప్రత్యేక పాలనాధికారిగా నియమింపబడ్డ, ఎంపీడీవో అత్తోట దీప్తి శుక్రవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయితీ పారిశుధ్య సిబ్బందిచే గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో మురుగు కాలువల్లో మురుగు తొలగింపు, వ్యర్థాల గుట్టలు తరలించటం లాంటి పనులు సిబ్బందిచే దగ్గరుండి చేయించారు.అనంతరం



ప్రత్యేక పాలనాధికారి,ఎంపీడీవో అత్తోట దీప్తి మాట్లాడుతూ, మేజర్ పంచాయితీ అయిన కొలకలూరు గ్రామంలో పంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు, సిబ్బందిచే అసంపూర్తిగా నిలిచిన పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, స్వచ్ఛ కొలకలూరుకి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

# ఉద్యోగ,ఉపాధ్యాయ,విశ్రాంతి ఉద్యోగులకు నగదు రహిత చికిత్సను అందిచాలి

**గుంటూరు విద్య, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గుంటూరు జిల్లా కలెక్టర్ గా శ్రీ సాయి కాంత్ వర్మ ని శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంతి ఉద్యోగుల కు ప్రభుత్వ నెట్వర్క్ హాస్పిటల్లో నగదు రహిత చికిత్సను అందిచాలని , జిల్లా కలెక్టర్ సీఎం సాయి కాంత్ వర్మ ని కలిసి వినతిపత్రం సమర్పించారు ఎన్ని సార్లు విన్నవించుకున్నా నెట్వర్క్ హాస్పిటల్ యాజమాన్యం లో ఎటువంటి మార్పు రావడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్ళడం జరిగింది.కలెక్టర్ ని జిల్లాలో ఉన్న నెట్వర్క్ హాస్పిటల్లో ఉద్యోగులకు నగదు రహిత చికిత్సను అందించుటకు హస్పటల్ యాజమాన్యంతో , ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగులకు న్యాయం పరమైన సమస్యను పరిష్కరించాలని



కోరినారు . ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా సమన్వయకర్త రెహమాన్, కోటసాహేబ్ , రాజు, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ జిల్లా కార్యదర్శి హిదయతుల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి సుమిత్రా దేవి, మల్లేశ్వరి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష కోఆపరేటివ్ నాయకులు అన్వర్ బాషా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ నాయకులూ జ్ఞానదేవ్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో క్విక్ స్పోర్ట్స్ అకాడమి క్రీడాకారులు విజయం

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్10,(ప్రభాతవార్త):** 13వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా రాజాం నకు చెందిన క్విక్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరచి ఘన విజయాన్ని సాధించారు. ఏప్రియల్ మూడు నాలుగు ఐదు తేదీల్లో తెనాలిలో జరిగిన 13వ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో క్విక్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు, మొత్తంగా ఏడు పతకాలను కైవసం చేసుకున్నారు.47 కేజీల జూనియర్ విభాగంలో షానూన్,76 కేజీల సబ్ జూనియర్ విభాగంలో బి. లిఖిత అలాగే 84 కేజీల సబ్ జూనియర్ విభాగంలో ఈ ఎల్.వినయ శ్రీ,93 కేజీల జూనియర్ విభాగంలో ఎస్. కౌశిక్ బంగారు పథకాలను గెలుచుకున్నారు. అలాగే 47 కేజీల సబ్ జూనియర్ విభాగంలో టీ. వేదశ్రీ,76 కేజీల జూనియర్ విభాగంలో ఎం.హేమసాయి బిందు,84 కేజీల మాస్టర్ గా ఏ.లక్ష్మీ తులసి వెండి పతకాలు గెలుచుకున్నారు.84 కేజీలు సబ్ జూనియర్ విభాగంలో ఎం ధాత్రి కాంస్య పథకాన్ని గెలుచుకున్నారు.ఈ సందర్భంగా క్విక్ అకాడమీ మేనేజ్మెంట్ వారు కొమ్మినేని భార్గవ్ కుమార్, కోచ్



లు ఘట్టమనేని సాయి రేవతి (కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్) పూసపాటి శివరామ కిరణ్ రాజు లు,క్రీడాకారుల విజయానికి ముఖ్యపాత్ర పోషించినందుకు, అభినందనలు తెలిపారు. అదేవిధంగా క్విక్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన ఎస్.కౌశిక్ నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ కాంపిటీషన్లో 93 కేజీల విభాగంలో 687.5 కేజీల బరువులు ఎత్తి బంగారు పథకాన్ని కైవసం చేసుకోవటమే కాక స్ట్రాంగ్ మెన్ టైటిల్ను కైవసం చేసుకున్నారు.

# నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**తెనాలి మున్సిపాలిటీ,ఏప్రిల్10,(ప్రభాతవార్త):** నూతన విద్యుత్ లైన్ లో మార్చడం మరియు 11 కెవి విద్యుత్ లైన్ల మరమ్మత్తులు దృష్ట్యా పట్టణంలోని శివాజీ చౌక్ కొత్తపేట నాజరు పేట తదితర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని అదేవిధంగా విద్యుత్ లైన్ లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించు నిమిత్తం పట్టణ పరిధిలోని బాలాజీ రావు పేట ఎడ్ల లింగయ్య కాలనీ చెంచుపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్ అమరావతి ప్లాట్స్ మహేంద్ర కాలనీ పాండురంగపేట పినపాడు చంద్రబాబు నాయుడు కాలనీ మారీసు పేట తదితర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని,కావున వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహకరించవలసిందిగా ఏపీసిపిడిసిఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు

## కెఎల్యు డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్

**తాడేపల్లి,ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** సేవకు మారుపేరైనా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వంటి విభాగం నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం వలన విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు సహజంగా అలవడతాయని





కెఎల్యు స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ విద్యార్థులకు సూచించారు.శుక్రవారం క్యాంపస్లో జరిగిన “కెఎల్యు ఎన్ఎస్ఎస్ సక్సెస్ మీట్”లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.సేవా కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాల్సి ఉండటం వలన విద్యార్థులు బాధ్యతను తీసుకోవడం,సమయపాలన పాటించడం,వాలంటీర్ల బృందాలను నడిపించడం, సమన్వయం చేయడం,పనులను విభజించడం, సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలు విద్యార్థుల్లో సమర్థ నాయకత్వ నైపుణ్యాలు పెంపొందిస్తాయని సీఎస్ఈ విభాగాధిపతులు డాక్టర్ కె.అమరేంద్ర,డాక్టర్ బి.తిరుపతిరెడ్డి,డాక్టర్ ఎ.సింథిల్ అథితన్,డాక్టర్ టి.పవన్కుమార్ తెలిపారు.వాలంటీర్లు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్లో భాగస్వాములు కావడం వలన వ్యక్తిత్వ వికాసం,నాయకత్వ లక్షణాలు,సమాజ అవగాహన, ఆత్మవిశ్వాసం,టీమ్ వర్క్,సేవాభావం,సమాజిక బాధ్యత నేర్చుకోవచ్చని,చదువుతోపాటు జీవితానికి అవసరమైన విలువలు,నైపుణ్యాలు నేర్పుతుందని చెప్పారు.ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు జ్ఞాపిక,ధృవీకరణ పత్రం అందించి ప్రశంసించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ శాంతిశ్రీ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సిహెచ్ నాగమణి,డాక్టర్ జి.మోహనరావు,డాక్టర్ జి.ఆంజనేయులు,డాక్టర్ రాజా విజయ్,పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్రావుపేట అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం

**గుంటూరు విద్య, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** గుంటూరు అర్బన్ ఈస్ట్ వన్ సెక్టార్ లోని వెంకట్రావుపేట అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ ఎస్ కే మొహరూనిస్సా మాట్లాడారు. పోషణ పట్వాడానికి సంబంధించిన పలు అంశాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలలో ఫోను స్క్రీన్ తగ్గించేందుకు తోడ్పడే వివిధ అంశాలు దాని వలన కలిగే నష్టాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఫోన్ స్క్రీన్ నుంచి పిల్లలను కాపాడే అంశాలలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఐటిసి ప్రదం కోఆర్డినేటర్ స్వాతి మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధి పరమైన వివిధ విషయాలను వివరించారు. ఆట ఆధారిత విద్యా అంశాలతో పిల్లలకు



ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ఈ తరహా విద్య అంగన్వాడీల లోనే లభ్యమవుతుందని తల్లులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగనవాడిలకు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సల్మా సత్తాజ్, సహాయకురాలు సుబ్బలక్ష్మి ఆ ప్రాంత తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్కు విశేష స్పందన

**గుంటూరు విద్య, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** స్థానిక అమరావతి రోడ్డునందు గల హిందూ ఫార్మసీ కళాశాలలో ఇండియన్ హెల్త్ కేర్, బిపిఓ,చెన్నై వారు శుక్రవారం నిర్వహించిన మెడికల్ కోడింగ్, మెడికల్బిల్లింగ్ ఎక్జిక్యూటివ్ పూల్ కాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్2కే26 కు విశేష స్పందన లభించినట్లుకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తెలిపారు.ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించి పై



సంస్థనుంచి విచ్చేసినసీఈవో జె.శ్రీధర్, హెచ్ఆర్ మేనేజర్ మరియమ్ లను పరిచయం చేశారు.జె.శ్రీధర్ మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూ లో ఎంపికైనవిద్యార్థులను జూనియర్ మెడికల్ కోడర్గా తరువాత సీనియర్ మెడికల్ కోడర్,కోడింగ్ఆడిటర్, కోడింగ్ ట్రైనర్,ప్రాజెక్ట్ మేనేజర్గా పదోన్నతి పొందవచ్చు నని అన్నారు. మరియమ్ మాట్లాడుతూ నెలకు రూ.25,000 వేతనం ఇస్తామని ఆతరువాత వార్షిక పెంపు,అలవెన్స్ లు ఉంటాయన్నారు.ఈ రోజు జరిపిన ఇంటర్వ్యూలలో 11 మంది విద్యార్థులుఉత్తీర్ణత సాధించారన్నారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపుడి రంగరాజు, డాక్టర్ఎస్.మధుసూదనరావు ఇండియన్ హెల్త్ కేర్ యాజమాన్యానికి తమ అభినందనలుతెలిపారు.ఈ కార్యక్రమంలో ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్.డి.బ్రహ్మ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు తదితరఅధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# 12న అవగాహన..లో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 18సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈవారం ఎముకలు,కీళ్ళు,కండరాల వ్యాధులపై ఆరోగ్యసభ ఏర్పాటు చేయబడిందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.ఏప్రిల్ 12 ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో జరిగే ఆరోగ్యసభకు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు,మోకీలు మార్పిడి నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ పోలిశెట్టి ప్రధాన వక్తగా పాల్గొంటారన్నారు.ఆరోగ్యసభలో మోకాలు అరుగుదల,ఎముకల ఆరోగ్య సమస్యలు,కీళ్ళ నొప్పులు,ఆర్థరైటిస్,వెన్నెముక,మెడ సమస్యలపై ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన కలగజేస్తారన్నారు.ఈ 390ఆదివారం ఆరోగ్యసభకు ఆరోగ్యాభిలాషులందరూ హాజరు కావాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# మైనర్లుకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం : ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు క్రైమ్,ఏప్రిల్10,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతా నియమాలు,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించడానికి,ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం"ప్రత్యేక డ్రైవ్" నిర్వహించబడింది.ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకోబడినవి.జిల్లా వ్యాప్తంగా మొత్తం 842 ద్విచక్ర వాహనాలు స్వాధీనం,అందులో 206 వాహనాలు సీజ్, మిగతా 636 వాహనాలకు రూ.3,36,913/ జరిమానా విధించబడింది.శుక్రవారం గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన "ప్రత్యేక డ్రైవ్ లో రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా పోలీస్ వారికి పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ " కార్యక్రమంలో పాల్గొని వాహనదారులకు,వారి తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి పలు ఆదేశాలు, సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మోటార్ వాహనాల నిబంధనలు పాటించకుండా,వాటిని అతిక్రమిస్తున్న వారిని గుర్తించి,రోడ్డు ప్రమాదాలను నివారించే లక్ష్యంతో రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలను గురించి అందరికీ అవగాహన కల్పించాలని జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వాహన డ్రైవ్ నిర్వహించి, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, లైసెన్సు, ఇన్సూరెన్స్, హెల్మెట్, నంబర్ ప్లేట్ మొదలగునవి లేకుండా నడిపే వాహనాలు స్వాధీన పరచుకుని, వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించాలనే ఉద్దేశంతో శుక్రవారం జిల్లా కార్యాలయానికి పిలిపించడం జరిగింది.అంతే తప్ప ఎవరిని ఇబ్బంది పెట్టడం,జరిమానాలు విధించడం మా ఉద్దేశం కాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరే విధంగా చూడడమే మా ప్రధాన ఉద్దేశం.మోటార్ వాహనాల నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.మైనర్ డ్రైవింగ్ - 164 (సీజ్: 80, జరిమానా: 84),ట్రిపుల్ రైడింగ్ - 36 (సీజ్: 18, జరిమానా: 36),లైసెన్స్ లేని వాహనాలు - 358 (సీజ్: 48,జరిమానా: 310),నంబర్ ప్లేట్ లేని వాహనాలు - 96 (సీజ్: 47, జరిమానా: 49),డ్రంక్ అండ్ డ్రైవ్ - 1 (సీజ్: 1),అనధికార పార్కింగ్ - 169 (సీజ్: 12, జరిమానా: 157)

రోడ్లపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికీ ప్రాథమిక బాధ్యతలు ఉన్నాయి.తమ భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరించడం,ఇతరుల భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరించడంరోడ్లపై ప్రయాణించే సమయంలో మోటార్ వాహనాల చట్టాలు,ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి వాహనదారుడి కర్తవ్యము.రోడ్డు ప్రమాదాలను తగ్గించడం,ప్రజల ప్రాణాలను రక్షించడం కోసం ప్రభుత్వాలు దీర్ఘకాల పరిశీలన తర్వాత ఈ నిబంధనలు అమలు చేస్తున్నాయి.మనం జాగ్రత్తగా వాహనం నడిపినప్పటికీ, ఇతరుల నిర్లక్ష్యం వలన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అత్యంత అవసరం.వాహనం నడపడానికి చట్టబద్ధమైన అర్హతను నిర్ధారించే పత్రం డ్రైవింగ్ లైసెన్స్. సరైన శిక్షణ లేకుండా వాహనం నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయి.అందువల్ల ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగి ఉండాలి. లైసెన్స్ ఉన్నప్పుడు మాత్రమే ఇన్సూరెన్స్ సదుపాయం కూడా లభిస్తుంది.మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్ట విరుద్ధం మాత్రమే కాకుండా ప్రమాదకరం కూడా తల్లిదండ్రులు ప్రేమతో వాహనాలు ఇచ్చినా,అది పిల్లల ప్రాణాలకు ముప్పుగా మారుతుంది. మైనర్లలో నిర్ణయ సామర్థ్యం పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయి.కాబట్టి తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.రోడ్డు ప్రమాదాల్లో తల గాయాలు మరణాలకు ప్రధాన కారణంగా గుర్తించబడ్డాయి. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చు.జరిమానా భయం వల్ల కాకుండా,వ్యక్తిగత భద్రత కోసం హెల్మెట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలి.ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఖచ్చితంగా పాటించడం అవసరం. రెడ్ సిగ్నల్ వద్ద వాహనాలను ఆపకపోతే లేదా స్టాప్ లైన్ దాటితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.ఈ నిబంధనల అమలుకు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోంది.రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్య ఖర్చులు అధికంగా ఉంటాయి.ఇన్సూరెన్స్ ఉండడం వల్ల గాయపడిన వారికి వైద్య సహాయం, మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది.కాబట్టి ప్రతి వాహనదారుడు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి.శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్/అవగాహన కార్యక్రమం ఉద్దేశం వాహనదారులను ఇబ్బంది పెట్టడం కాదు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడం మరియు ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా చేయడం ప్రధాన లక్ష్యం.రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబానికి కలిగే నష్టం పూడ్చలేనిది.ముఖ్యంగా కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే,ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం,లైసెన్స్ కలిగి ఉండడం,ఇన్సూరెన్స్ చేయించుకోవడం,ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి.జాగ్రత్తగా వాహనం నడిపినా,ఇతరుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు సంభవించవచ్చు. అలాంటి సందర్భాల్లో హెల్మెట్,ఇన్సూరెన్స్ ప్రాణాలను,ఆర్థిక భద్రతను కాపాడగలవని గుర్తుంచుకోవాలి. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు,ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్,ఎస్బి డీఎస్పీ శ్రీనివాసులు,ట్రాఫిక్ సీఐ అశోక్,సింగయ్య,పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు,లాలపేట సీఐ శివప్రసాద్,అరండల్ పేట సీఐ ఆరోగ్యరాజు,నగరంపాలెం సీఐ సత్యనారాయణ,అర్.ఐ శ్రీహరి రెడ్డి,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

-ప్రభుత్వ లక్ష్యాలను ప్రతి అధికారి చేరుకోవాల్సిందే -పిజిఆర్ఎస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి -రీ సర్వేలో తప్పులు దొర్లితే ఇంటికే -జిల్లా కలెక్టర్ సీఎం సాయి కాంత్ వర్మ



**పొన్నూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సీఎం సాయి కాంత్ వర్మ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లు అన్ని శాఖలకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడంలో ప్రతి అధికారి శ్రద్ధ చూపాలన్నారు.విధుల్లో అలసత్వం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పీజిఆర్ఎస్‌పై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పీజిఆర్ఎస్‌కు సంబంధించిన అర్జీలను కొంత మంది అధికారులు చూడడం లేదన్నారు. పీజిఆర్ఎస్‌కు సంబంధించిన అర్జీలను 12గంటల్లోపు ఆన్‌లైన్‌లో లాగిన్ అయి చూడాలని, అర్జీదారు తృప్తిపడేవిధంగా క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం జరిగేవిధంగా చూడాలన్నారు. రీ సర్వే జరిగే గ్రామాల్లో ఎలాంటి తప్పులు, అక్రమాలకు అవకాశం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేసేవిధంగా అధికారులు పనిచేయాలన్నారు. రీ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. తప్పులు దొర్లితే అందుకు వీఆర్వో నుంచి పై స్థాయి అధికారి వరకు బాధ్యులవుతారని హెచ్చరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటి చలివేంద్రాల ఏర్పాటుకు దాతలను ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో చెరువులు, కాలువలు, ఇతర వసతులకు సంబంధించిన పూర్తి సమాచారం ఆయా ఎంపిడిఓలు సిద్ధంగా ఉంచాలన్నారు. మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేవిధంగా చూడాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి మంచినీటిని ప్రజలకు సరఫరా చేయాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర మందులను సిద్దంగా ఉంచాలన్నారు. ప్రతి కార్యాలయంలో నోటీసు బోర్డులను ఏర్పాటు చేయాలని, వాటిని సక్రమంగా నిర్వహించాలన్నారు. తాను సూచనలు చేశాక, అందుకు అనుగుణంగా నడుచుకోపోతే తాను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన సమయంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి మండలస్థాయి అధికారి బాధ్యతగా వ్యవహించాలన్నారు. అందుకు ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, ఏపిఎం జోజిబాబు, సీడీపిఓ ఉమామహేశ్వరి, వైద్యులు అయినంపూడి గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచులు పార్టీ పటిష్టత పై దృష్టి సారించాలి

-వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



**పొన్నూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** ఇప్పటి వరకు గ్రామాభివృద్ధిపై దృష్టిసారించి, ప్రజలకు వివిధ రకాల సేవలు అందించిన తాజా మాజీ సర్పంచులంతా ఇక మీదట పార్టీ పటిష్టతపై దృష్టి సారించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కోరారు. స్థానిక ఇటికంపాడు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం తాజా మాజీ సర్పంచుల వీడ్కోలు సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ళపాటు సర్పంచులుగా కొనసాగి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి ప్రజల మెప్పు పొందిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. పొన్నూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి నరేంద్రను గెలిపిస్తే ఆయన గుంటూరులో మకాం పెట్టి ఇక్కడి ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఆయన కంటే తానే ఎక్కువ ప్రజల్లో ఉంటునన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ పూర్తిస్థాయిలో అవినీతికి పాల్పడుతున్నాడన్నారు. సీఎంఆర్ఎఫ్, మొక్కజొన్న కొనుగోళ్ళు, లేఅవుట్లలో కమీషన్లు, వాటాలు పుచ్చుకొంటూ అవినీతికి పాల్పడుతున్నాడన్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ కూడా ఇచ్చేందుకు టిడిపి అధిష్టానం సిద్దంగా లేదన్నారు. వైకాపా కార్యకర్తలపై జులుం చూపిస్తే తన తడాఖా చూపిస్తానని అంబటి హెచ్చరించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ పోలీసులను అడ్డం పెట్టుకొని విమర్శిస్తున్నవారిపై కేసులు నమోదు చేయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికి తనపై 15 కేసులు నమోదు చేశారన్నారు. నరేంద్ర ఎన్ని కేసులు పెట్టించినా భయపడే ప్రశ్నేలేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై చేయి వెయ్యాలంటే తనను దాటి వెళ్ళాలని కార్యకర్తలకు భరోసా ఇచ్చి ఉత్సాహాన్ని నింపారు. రానున్న రోజుల్లో అనేక ప్రజా ఉద్యమాలు చేస్తామని, పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ విభాగాల బాధ్యులు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని తాజా మాజీ సర్పంచులను దుశ్శాలువాలతో, బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తుల్లిమిల్లి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు షేక్ మహమ్మద్ నాజర్, చింతలపూడి మురళీకృష్ణ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దక్కుమళ్ళరవి, మండలనేని శ్రీనివాసరావు, చిర్రా అక్కిరెడ్డి, షేక్ మౌలాలి, నల్లమోతు రవీంద్రబాబు, మరియరాణి, తదితరులున్నారు.

# గుంటూరులో ఫుడ్ సేఫ్టీ శిక్షణ కార్యక్రమం నిర్వహణ

**గుంటూరు ఏప్రిల్ 10 ప్రభాత వార్త ప్రతినిధి :** ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ప్రతి వ్యాపారస్తుడు ఆహార భద్రతపై అవగాహన కలిగి ఉండటం అత్యవసరమని 2017 నుంచి ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుంటూరులో శిక్షణ తరగతులు నిర్వహించబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్. పూర్ణచంద్రరావు ఆదేశాల మేరకు, అలాగే ఫోస్టాక్ నోడల్ ఆఫీసర్ వేణుగోపాలరావు సూచనలతో గుంటూరు జిల్లా కృష్ణానగర్ రెండో లైన్‌లోని ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ కార్యాలయంలో పలు హోటల్ వ్యాపారస్తులకు శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ తరగతులకు శిక్షకుడు కలకండ ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఆహార తయారీ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, సరైన విధానాల గురించి వివరంగా సూచనలు అందించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం ప్రతి వ్యాపారస్తుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అనంతరం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం ప్రతి వ్యాపారస్తుడు ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకుని వ్యాపారం చేయాలని తెలిపారు. అలాగే ఆహార తయారీలో ఉపయోగించే నీటి నాణ్యతపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఫుడ్ లైసెన్స్ పొందాలనుకునే వ్యాపారస్తులు కృష్ణానగర్ మొదటి లైన్‌లో బాలాజీ హాస్టల్ ఎదుట ఉన్న ఫుడ్ సేఫ్టీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. అలాగే నీటి నమూనాల పరీక్షల కోసం గుంటూరు రీజినల్ ల్యాబొరేటరీని సంప్రదించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జోనల్ హెడ్ గజ్జలకొండ సాయినాథ్, జంపుల నవీన్, కార్యాలయ సిబ్బంది ప్రవళికతో పాటు పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.



# కార్మిక శాఖకు చెందిన స్థలం క్రీడా ప్రాంగణంకు కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం అభినందనీయం

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 10, (ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలోని కాకుమాను వారి తోటలో ఉన్న కార్మిక శాఖ స్థలం ( వెల్ఫేర్ సెంటర్) లో ఎకరం రెండు సెంట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడా ప్రాంగణం కోసం కేటాయిస్తూ మంత్రి వర్గం ఆమోదించటం అభినందనీయమని గుంటూరు నగర టిడిపి మాజీ కార్పొరేటర్లు, పలువురు



టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు. కార్మిక శాఖకు చెందిన ఈ స్థలాన్ని కార్పొరేషన్ కు బదలాయించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అభ్యర్థన మేరకు అప్పటి లో మేయర్ కోవెలమూడి రవీంద్ర నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులతో చర్చించి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి చర్చించడం జరిగిందని తెలిపారు. స్థలాన్ని కార్పొరేషన్ కు కేటాయించి నారా చంద్రబాబు నాయుడు క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి

**ఈ స్థలాన్ని కార్పొరేషన్‌కు కేటాయించేందుకు కృషి చేసిన కేంద్రమంత్రి పెమ్మసాని.. స్థానిక ఎమ్మెల్యే నసీర్.. మాజీ మేయర్ కోవెలమూడిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన టిడిపి మాజీ కార్పొరేటర్లు.. నాయకులు**

చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది అన్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్మిక శాఖ స్థలం 6.26 సెంట్లు నారా చంద్రబాబునాయుడు క్రీడా ప్రాంగణం కోసం కార్పొరేషన్కు బదలాయిస్తూ మంత్రివర్గం ఆమోదించడంపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, గుంటూరు నగర మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర లకు నగర టిడిపి మాజీ కార్పొరేటర్లు, టిడిపి నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు, నగర టిడిపి మాజీ కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్ ( సిటీ బస్ బాబు ), మీరావలి, ఖాజా మొహిద్దిన్ (చిష్టి ), టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మనవ వంశీ, రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ నాయకులు ఉప్పుటూరు పేరయ్య, ఎస్సీ సెల్ నాయకులు సొపాటి రత్నం, 33 వ డివిజన్ అధ్యక్షులు పోపూరి నరేంద్ర, ప్రధాన కార్యదర్శి కొనికి వినోద్ కుమార్, పాటిబండ్ల బలరాం తదితరులు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధరకు విక్రయించుకోండి : వ్యవసాయా మార్కెట్‌యార్డు ఛైర్మన్ షేక్ రిజ్వానా



**పొన్నూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు విక్రయించుకొని ఆర్థికంగా బలపడాలని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ షేక్ రిజ్వానా కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో జీడీసి ఎమ్మెస్ బ్రాంచిలో శుక్రవారం పెసలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజ్వానా మాట్లాడుతూ ప్రభుత్వం పెసలు క్వింటాకు రూ.8,768మద్దతు ధర అందిస్తుందన్నారు. రైతులందరూ దళారుల చేతిలో మోసపోకుండా కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించుకోవాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ తేమ శాతం 12, ఇతర వ్యర్థాలు 2శాంతం, ఇతర పంట గింజలు3శాతం, దెబ్బతిన్న ముతక గింజలు 12శాతం,నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలలో మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, చలంశెట్టి సీతారామయ్య, నల్లమోతు రాధాకృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్, ఎంపీఈవో సింహాద్రి సురేష్‌బాబు, షేక్ రేష్మ తదితరులున్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

-వ్యవసామ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు

**పొన్నూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** అగ్ని ప్రమాద బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని, అందులో భాగంగా శుక్రవారం బాధితులకు



బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. మండల పరిధిలోని కసుక్రరు గ్రామానికి చెందిన పక్కెల సుబ్బమ్మ గృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచింది బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బొప్పన బాపనయ్య, బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు, చలమశెట్టి సీతారామయ్య, పూల సుబ్రహ్మణ్యం, ఆరె వెంకట్రావు, నాగిశెట్టి శ్రీనివాసరావు, యలవర్తి వెంకటేశ్వరరావు, సొపాటి వెంకట్రావు, మద్ది శ్రీనివాసరావు తదితరులున్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

-ఐసిడిఎస్ సూపర్ వైజర్ యు.పద్మజ

**పొన్నూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గర్తించాలని, వాటి నిరోధానికి కృషి చేయాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యు.పద్మజ పిలుపునిచ్చారు. పోషణ




పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎరుకలవాడలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహార లోపంతో ఎవరూ బాధపడకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అందుకే వివిధ మార్గాల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుక ప్రయత్నం చేస్తుందన్నారు. జీవితపు మొదటి ఆరు సంవత్సరాలలో పిల్లలు మెదడును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు పార్కిన్సన్స్ వ్యాధి పై అవగాహన సదస్సు

## నేడు ప్రపంచ పార్కిన్సన్స్ దినోత్సవం

**గుంటూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** ప్రపంచ పార్కిన్సన్స్ దినోత్సవం సందర్భంగా న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్ గుంటూరు, అధ్యక్షులు డా. పి.విజయ, కార్యదర్శి డా. శివరామకృష్ణ ఆధ్వర్యంలో పార్కిన్సన్స్ వ్యాధి అవగాహన కార్యక్రమం 2/7 బ్రాడీపేట లోని జాషువా విజ్ఞాన కేంద్రం, 2వ అంతస్తులో సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు నిర్వహించబడుతుంది.ప్రపంచవ్యాప్తంగా ఒక కోటి మంది పైగా పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్నారు. భారత దేశంలో సుమారు 10 లక్షల మంది ఈ వ్యాధి తో బాధపడుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూడా వృద్ధులలో సుమారు 2-3శాతం వరకు ఈ వ్యాధి పెరుగుతున్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయని డా. విజయ తెలిపారు ఈ కార్యక్రమంలో పార్కిన్సన్ లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, బహుళ వైద్య విధానాలతో చికిత్స, జీవనశైలి మార్పులు వంటి అంశాలపై గుంటూరు ప్రముఖ సీనియర్ న్యూరాలజిస్టులు వివరిస్తారు. ఈ కార్యక్రమంలో వ్యాయామాలు, ఔషధాలు, డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ వంటి ఆధునిక చికిత్సలు, ఆహార నియమాలు, రోజువారీ జీవన విధానంపై ఉపయోగకరమైన సూచనలు మరియు ముఖ్యాంశాలు అందించబడతాయి. ఈ కార్యక్రమంలో పార్కిన్సన్స్ వ్యాధి బాధితులు మరియు వారి కుటుంబ సభ్యులు చురుకుగా పాల్గొని నిపుణుల సూచనలు పొందగలరు.ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో గుంటూరు ప్రెసిడెంట్ డా విజయ , వైస్ ప్రెసిడెంట్ డా . సుందర చారి , సెక్రటరీ డా శివరామ కృష్ణ , కోశాధికారి డా. శ్రీనివాస రావు , సీనియర్ ఫాకల్టీ డా తారకనాథ్, ఈసీ మెంబెర్స్ పాల్గొంటారు.

# రక్తదానం చేయండి ప్రాణదాతులు కండి

-తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జియావుల్ హక్ మాట్లాడుతూ ప్రస్తుతం రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయని, యువత ముందుకు



వచ్చి రక్తదాన్ని చేయాలని కోరారు. కోవిడ్ కారణంగా రక్తం నిల్వలు అడుగంటాయన్నారు. ఎంతో రోడ్డు ప్రమాదంలో గాయపడి రక్తం కోసం ఎదురు చూస్తుంటారని, వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు కొల్లిపర ఆంజనేయులు, ఆర్ఎస్ కిరణ్, నన్నపనేని బాలకృష్ణ, జీఎంఎస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలి

-మండల వైద్యాధికారి నేహ

**కొల్లిపర,ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి నేహ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నేహ మాట్లాడుతూ వేసవికాలంలో గర్భిణీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు



మందులు వాడుకోవాలన్నారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు,ఎఎన్ఎంలు,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టిగా కృషి చేయండి..జల పునరుద్దరణ కార్యక్రమం విజయవంతం చేయండి : ఎంపీడీవో

**కొల్లిపర,ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ప్రభుత్వ లక్ష్యాలకు అణుగుణంగా నీటి సంరక్షణ భూగర్భ జల పునరుద్దరణ కార్యక్రమం విజయవంతం చేయటానికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మీ



అన్నారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ సమీకృత నీటి నిర్వహణ,చెరువులు,కాలువలు పునరుద్దరణ,నీటి సంరక్షణ విధానాలు..పచ్చదనం పెంపొందించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు.కార్యక్రమంలో పరిపాలనాధికారి కిషోర్‌కుమార్,డిప్యూటి ఎంపీడీవో భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# 2,657ఎకరాల్లో పెసర సాగు

చేబ్రోలు(పొన్నూరు), ఏప్రిల్ 10,ప్రభాతవార్త: ఈ ఏడాది రబీ పంట కాలంలో చేబ్రోలు మండలంలో 2,657ఎకరాల్లో పెసర సాగు చేశారని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని చెప్పారు. మండల పరిధిలోని చేబ్రోలు, నారాకోడూరు, వేజండ్ల, సుద్దపల్లి, శేకూరు, అనంతారం గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో రైతులు పెసర సాగు చేశారన్నారు. పెసర పంట కోత విరివిగా నిర్వహిస్తున్న సందర్భంలో రైతులు పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు.క్వింటాకు కనీస మద్దతు ధర రూ.8,768నిర్ణయంచినట్లు చెప్పారు. మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో పెసర కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. సంబంధిత రైతులు రైతు సేవా



కేంద్రాల ద్వారా నమోదు చేయించుకొని విక్రయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెలగా పవన్, గోపి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, జీడీసిఎమ్మెస్ సిబ్బంది,అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## భట్టి ప్రోలులో 15వ తేదీ సామాజిక తనిఖీ



**రేపల్లె, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ కార్యక్రమం జరుగుతుందని ఎంపిడివో ఎస్.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 18వ విడత సామాజిక తనిఖీ జరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

# బాపట్ల జిల్లా వార్త



## ప్రజలలో అవగాహనతోనే అగ్నిప్రమాదాల

# నియంత్రణ సాధ్యం

**-రేపల్లెలో రూ.86.2 లక్షల ఆస్తి నష్టం**
**-సిబ్బంది కొరతను నివారించాలి**
**-చెరుకుపల్లిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి**

**రేపల్లె-ప్రభాతవార్త**

తీరప్రాంత ప్రజలలో అగ్నిప్రమాదాల నివారణపై రేపల్లెలోని అగ్నిమాపక శాఖ యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది.ప్రజల భద్రత కోసం అగ్నిమాపక శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటోంది.ప్రమాదాలు సంభవించినప్పుడు అదుపులోకి తేవడం,విపత్తుల సమయంలో రక్షణ చర్యలు చేపట్టడంలో అగ్నిమాపక సిబ్బంది బాధ్యతతో విధులను నిర్వర్తిస్తున్నారు.అగ్నిప్రమాదాలలోనే కాకుండా తుఫానులు,వరదలు వంటి అత్యవసర పరిస్థితులలో ప్రజల ప్రాణ,ఆస్తులను రక్షించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.ప్రమాదాలు జరిగేవరకూ కాకుండా ముందుగానే ప్రజలలో అవగాహన పెంచితే ప్రమాదాల



తీవ్రతను తగ్గించవచ్చునే ఆలోచనలో అగ్నిమాపకశాఖ ఉంది.దీనిలో బాగంగా భవన నిర్మాణాలకు సంబంధించి ఎన్ఓసి (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్)జారీ చేస్తున్నారు.ప్రమాద సమయాలలో తక్షణమే సంఘటనా ప్రదేశాలకు చేరుకుని మంటలను ఆర్పి సహాయక చర్యలను చేపడుతున్నారు.ప్రజలలో అవగాహన కల్పించేందుకు,సిబ్బందిలో సామర్థ్యాన్ని పెంచేందుకు మాక్ డ్రిల్స్ నిర్వహించడం వలన తగిన ఫలితాలు లభిస్తున్నాయి.విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించే కార్యక్రమాన్ని రేపల్లె పట్టణంలో చేపట్టారు.వేసవి వచ్చిందంటే అధిక శాతం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి.పాత విద్యుత్ వైరింగ్ లోపాల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఫ్రిజ్,ఎసి పరికరాలను జాగ్రత్తగా వినియోగించకపోవడంతో ప్రమాదాలు ఏర్పడుతున్నాయి.చరిత్రను తీసుకుంటే ప్రాచీన రోమ్ సామ్రాజ్యంలో క్రీ.పూ 27లో ఆగస్టస్ చక్రవర్తి పరిపాలనా కాలంలో 7 వేల మందితో విజిల్స్ అనబడే తొలి వ్యవస్థీకృత అగ్నిమాపక దళం ప్రారంభమైంది.సాంకేతికాభివృద్ధిలో భాగంగా 1723లో తొలి పేటెంట్‌ను అగ్నిమాపక యంత్రం పొందింది.1818లో పోర్టబుల్ అగ్నిమాపక యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు.19వ శతాబ్దంలో సోడా యాసిడ్ అగ్నిమాపక యంత్రాల పేటెంట్లు లభించాయి.ఆధునిక కాలానికి తగ్గట్టు పంపులు,నీటి ట్యాంకులతో కూడిన స్వయంచాలక వాహనాలను అభివృద్ధి చేశారు.అత్యాధునిక సాంకేతికతతో మంటను నియంత్రిచడం అగ్నిమాపక శకటాల ప్రధాన లక్ష్యంగా మారింది.రేపల్లె అగ్నిమాపక శాఖ కార్యాలయం పరిధిలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే అక్కడికి చేరుకోవడానికి దూరాన్ని బట్టి 10 నిమిషాల నుండి గంట సమయం తీసుకుంటోంది. రేపల్లె, భట్టిప్రోలు, నగరం, నిజాంపట్నం మండలాలు పూర్తిగా,చెరుకుపల్లి, కొల్లూరు,నగరం మండలాలలో కొన్ని గ్రామాలు రేపల్లె అగ్నిమాపక శాఖ పరిధిలో ఉన్నాయి.ఒక అగ్నిమాపక శకటం మాత్రమే ఉంది.మరొక అగ్నిమాపక వాహనం అవసరం ఉంది.సిబ్బంది కొరతను పరిష్కరించాల్సి ఉంది.ప్రస్తుతం ముగ్గురు డ్రైవర్లకు ఇరువురే ఉన్నారు.నలుగురు ఫైర్ సిబ్బందిని నియమించాల్సి వుంది.సిబ్బంది సమస్య కారణంగా నలుగురు హోంగార్డుల సేవలను పరిగణలోకి తీసుకుంటున్నారు.నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో అగ్నిమాపక శాఖ కార్యాలయం మంజూరు చేస్తూ గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజావేదికపై ప్రకటించారు. చెరుకుపల్లి మండల కేంద్రంలో అగ్నిమాపక శాఖ కార్యాలయం నూతనంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.ఈ మండలంలో అగ్ని ప్రమాదాలు జరిగితే రేపల్లె,పొన్నూరు అగ్నిమాపక శాఖ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది.దూరం నుండి అవి వచ్చేలోపు నష్టం జరిగిపోతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



**రూ.86.20 లక్షల ఆస్తి నష్టం..**

రేపల్లె అగ్నిమాపక శాఖ కార్యాలయం పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 93 అగ్నిప్రమాదాలు జరిగాయని రేపల్లె అగ్నిమాపక శాఖ అధికారి యార్లగడ్డ వెంకటేశ్వరరావు చెప్పారు.ప్రమాదాలకు రూ.29 కోట్ల 99 లక్షల 30 వేల ఆస్తి గురికాగా సకాలంలో రక్షణా చర్యలు తీసుకోవడం వలన రూ.86 లక్షల 20 వేల నష్టం మాత్రమే జరిగిందని ఆయన తెలిపారు.వేసవిలో గ్యాస్,విద్యుత్,గడ్డి వాములు,కట్టెపుల్లలతో వంట చేసే చోట,వాణిజ్య పంటల వ్యర్థాల కాల్చివేత వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే 101 ఫోన్ నెంబరుకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా ప్రజలు నీటిని అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు.ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసినట్లు వివరించారు.విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.



## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**రేపల్లె, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు,పెదపులివర్రు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రేపల్లె విద్యుత్ శాఖ డిప్యూటీ ఇఇ సుధాకర్‌బాబు శుక్రవారం తెలిపారు.రేపల్లె పట్టణంలోని 4వ ఫీడర్‌లో అత్యవసర మరమ్మతుల దృష్ట్యా ఏకలవ్య విగ్రహం సెంటర్,8వ వార్డు,డొంక రోడ్డు,రాజశ్రీ వక్కపొడి కంపెనీ ఏరియా,పల్స్ హాస్పటల్ రోడ్ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు.గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సుధాకర్‌బాబు కోరారు.

## నేడు,రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

**రేపల్లె, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** పురపాలక సంఘంలో తాగునీటి శుద్ధి కేంద్రంలో జరుగుతున్న పనుల కారణంగా శని,ఆదివారాలలో తాగునీటి సరఫరాకు సంబంధించి స్వల్ప అంతరాయమేర్పడుతుందని రేపల్లె మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు శుక్రవారం తెలిపారు.ఈ అసౌకర్యాన్ని గమనించి పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## క్రీడలతో ఆరోగ్యం

**నిజాంపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం క్రీడలు, ఆటలు ఆడుతుండాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని దిండి శివారు కేసనవారిపాలెంలో యేమినేని బాబూరావు స్మారక రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ కొంత సమయం ఆటలాడుతుండటం



వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆటల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎప్పుడు చురుగ్గా ఉంటారన్నారు. చేసే పనిలో అలసట ఉండదన్నారు. క్రీడా పోటీల వల్ల ప్రజల మధ్య పరిచయాలు పెరిగి సత్సంబంధాలు ఏర్పడతాయన్నారు. క్రీడాకారులు స్పోర్ట్స్ మెన్ స్పిరిట్ అలవర్చుకోవాలని, గెలిచినా ఓడినా ఒకేరకంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం మురహరి, తాతా ఏడుకొండలు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కొలసాని రాము, కె రామకృష్ణ, ఎం నరేష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్య ప్రయోజనం

**రేపల్లె, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** పౌష్టికాహారం పొందితేనే ఆరోగ్యరీత్యా ప్రయోజనం చేకూరుతుందని రేపల్లె ఐసిడిఎస్‌ప్రాజెక్టు సిడిపివో ఎం.సుచిత్ర చెప్పారు.శుక్రవారం రేపల్లె పట్టణంలోని శివాజీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు,గర్భిణీలు,తల్లులకు పోషణ



పక్వాడా అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగంగా లభించే ఆహార పదార్థాలు అనారోగ్యానికి గురిచేస్తాయని చెప్పారు.కేలరీలు తక్కువగా ఉంటాయని అవసరమైన పోషక విలువలు లభించవని తెలిపారు.దీని వలన గుండె,రక్తపోటు తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అవగాహన కల్పించారు.

## ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలి : సూపర్వైజర్ ధనలక్ష్మి

**చెరుకుపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ప్యాకెట్లలో లభించే ఆహార పదార్థాల వలన అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంగన్వాడి సూపర్వైజర్ ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పు పాలెం గ్రామంలో నిర్వహించిన అంగన్వాడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్యాకెట్ పాలు, తిను పదార్థాల వల్ల రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాటికి సాధ్యమైనంత దూరంగా ఉండాలని స్థానికులకు సూచించారు. ఈ పదార్థాల వల్ల శరీరానికి కావలసిన విటమిన్లు లభించవని కేవలం శక్తి మాత్రమే కొంతమేరకు మాత్రమే లభిస్తుందని వీటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మొక్కజొన్న, వేరుశనగ ,మరమరాలు, ఉడికించిన పదార్థాలను, జింక్ ఫుడ్స్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరానికి కావలసినటువంటి పోషకాలు లభిస్తాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు, పలువురు పాల్గొన్నారు.



## కర్రీ వెంకట శివ ప్రసాద్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**చెరుకుపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** మండలంలోని రాంభొట్ల పాలెం గ్రామానికి చెందిన కర్రీ వెంకట శివప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సానుభూతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు 10000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామ పార్టీ నాయకులు చిరంజీవి రెడ్డి, అలుమోలు దుర్గా రెడ్డి బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పిట్టు శ్రీనివాసరెడ్డి, పూర్ణ కుమారు, నారాయణ, శివకుమార్, కుంచెల కృష్ణారెడ్డి ,దుండి సంజీవరెడ్డి ,పాగోల సాయి, తదితరులు పాల్గొన్నారు.



## జనగనణ సక్రమంగా నిర్వహించాలి : మున్సిపల్ కమీషనర్

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్10(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలో తొలి విడత జనగణన సక్రమంగా జరిగేలా ఎన్నోమరేటర్లు తగు జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సూచించారు.పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో గల గుప్తా కళాశాలలో నిర్వహించిన ఏన్యుమరేటర్ల మరియు సూపర్వైజర్లకు నిర్వహించిన జనగణన శిక్షణాశిబిరం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వం నిర్దేశించిన జనగణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సెన్సెస్ అధికారి శ్రీమతి ఆదిలక్ష్మి, జన గణన లో పాల్గొనబోయే సూపర్వైజర్లకు ఎన్నోమరేటర్లకు ఉపాధ్యాయులకు,సెక్రటరీ లకు, జనగణలలో తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు సమాచార సేకరణలో ప్రజలతో ఏ విధంగా మమేకమవ్వాలి లాంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సెస్ అధికారి జగన్నాథ పూరి, టౌన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమతి వి. వాణి,పలువురు పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళ పై అసభ్య వ్యాఖ్యలు చేసిన రాధాకృష్ణ పై చర్యలు తీసుకోవాలి

**-వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్‌బాబు**

**వేమూరు ఏప్రిల్ 10 (ప్రభాతవార్త) :** మహిళ పట్ల అసభ్య వ్యాఖ్యలు చేసిన ఏబీఎన్ రాధాకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గం ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వేమూరు పోలీస్ స్టేషన్లో ఎస్సైకు వైసిపి నేతలు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం ప్లాన్ బి క్రింద మావిగన్ రాజధానిగా ఉండాలని సూచించారని దీన్ని జీర్ణించుకోలేక తెలుగుదేశం పార్టీ ముసుగు తొడిగి రాతలు రాస్తున్న ఏబీఎన్ రాధాకృష్ణ మహిళల పట్ల అసభ్యకర రీతిలో వ్యాఖ్యలు చేశారన్నారు. ఇది సభ్య సమాజం సిగ్గుపడేలా రాధాకృష్ణ వ్యాఖ్యలు ఉన్నాయని, తక్షణం ఏబీఎన్ రాధాకృష్ణ మహిళలకు క్షమాపణ చెప్పాలని, చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని రాయలేని రాధాకృష్ణ వైసీపీ పార్టీపై మాత్రం ఇష్టానుసారంగా పిచ్చి రాతలు రాస్తున్నారని విమర్శించారు. రాజధాని విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన శ్రీకృష్ణ కమిషన్ ముంపు గురయ్యే అమరాతిలో రాజధాని ఉండకూడదని ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. భట్టిప్రోలులో జరిగిన చంద్రబాబు మీటింగ్‌లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి జగన్ ఉచితగ్గులతో పోల్చి మాట్లాడడాన్ని ఆయన తీవ్రంగా



ఖండించారు. మంత్రి ఇలాకాలో విచ్చలవిడిగా పేకాట, జూదం నడుస్తున్నాయని అటువంటి మంత్రి అనగాని జగన్ను విమర్శించే స్థాయి కాదని అశోక్ బాబు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ ప్రజాపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్న వైసీపీపై లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజల పక్కదారి పట్టిస్తున్నారని అశోక్‌బాబు పేర్కొన్నారు. తక్షణం వేమూరి రాధాకృష్ణపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అశోక్‌బాబు డిమాండ్ చేశారు. ఆయనతో పాటు మాజీ జడ్పిటిసి విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, దున్నా మేరీస్‌బాబు, జంపని పురుషోత్తం, గుమ్మడి దానియేలు, మాజీ ఎంపిటిసి అంకమ్మరావు, యాదవ్, షేక్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహన్‌రెడ్డి పై విమర్శలు హాస్యాస్పదం : పీటా నాగమోహన్‌కృష్ణ

**రేపల్లె, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా పరిపాలన అందించిన జగన్మోహన్‌రెడ్డిని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు తీవ్రంగా విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ స్పష్టం చేశారు.శుక్రవారం రేపల్లె క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ గత ఐదేళ్ళ జనరంజక పరిపాలనను చూసి ఓర్వలేకనే చంద్రబాబు,సత్యప్రసాద్‌లు విమర్శలకు పాల్పడుతున్నారని చెప్పారు.చంద్రబాబుదే సైకో పాలన అని విమర్శించారు. అమరావతి రాజధాని పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.తుగ్లక్ తరహా నిర్ణయాలతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని ఆయన చెప్పారు.స్వార్థపూరిత నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి మావిగన్ పేరుతో జన రంజక రాజధాని ఏర్పాటు చేయాలని సూచించారని నాగమోహన్‌కృష్ణ వివరించారు.స్వల్ప సమయంలో స్వల్ప పెట్టుబడులతో మావిగన్ రాజధానిని అందుబాటులోకి తీసుకురావచ్చని జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని చెప్పారు.చంద్రబాబు నాయుడు స్వార్థ రాజకీయంతో అమరావతి నిర్మాణం కోసం 2 లక్షల కోట్ల రూపాయల కంటే ఎక్కువగా అవసరమని పదే పదే ప్రకటించడం,మంత్రులు వత్తాసు పలకడం చూస్తున్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని నాగమోహన్‌కృష్ణ తెలిపారు.అమరావతి ప్రాజెక్టు విఫలమైతే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి క్షణం ప్రజల సంక్షేమాన్ని కోరుకునే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదని ఆయన చెప్పారు.



## చేనేత పరిశ్రమ రక్షణ కోసమే పోరాటం : జి.బాలాజీ

**రేపల్లె, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** చేనేత పరిశ్రమ రక్షణ,కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆవిర్భవించిందని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ చెప్పారు.శుక్రవారం భట్టి ప్రోలులోని చేనేత కార్యాలయం వద్ద చేనేత కార్మిక సంఘం 90 వార్షికోత్సవ వేడుకలలో భాగంగా సీనియర్ చేనేత కార్మికుడు కౌతరపు పార్థసారధి పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 1936 సంవత్సరం ఏప్రిల్ 10వ తేదీ ఆవిర్భవించినట్లు తెలిపారు.స్వాతంత్ర్య పోరాటంలో జాతిపిత మహాత్మా గాంధీ రాట్నాన్ని చిహ్నంగా చేసుకుని విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ వస్త్రాలను ధరించాలని పిలుపునిచ్చారని ఆయన వెల్లడించారు.మహాత్మా గాంధీ పిలుపుతో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది చేనేత కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని చెప్పారు.1818లో నాటి బ్రిటీష్ పాలకులు కోల్‌కతాకు 15 కి.మీ దూరంలో వస్త్రాల మిల్లులను ఏర్పాటు చేసి చేనేత పరిశ్రమకు చెందిన వందలాది కార్మికులను కూలీలుగా మార్చుకుని చేనేత పరి శ్రమకు నష్టం కలిగించారని తెలిపారు.1920లో ఎఐటియుసి ఆవిర్భవించి పోరాటాలు కొనసాగిస్తున్న సమయంలో మిల్లు వ స్త్రాల పోటీ వలన చేనేత పరి శ్రమ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు.ఇటువంటి పరిస్థితిలో చేనేత రక్షణ,కార్మిక హక్కుల సాధన కోసం ఉప్పాడలో పుచ్చల సత్యనారాయణ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అలుపెరగని పోరాటాలకు శ్రీకారం చుట్టిందని బాలాజీ గుర్తు చేశారు.వస్త్ర నాగరికతకు వన్నె తెచ్చిన చేనేతను రక్షించుకునేందుకు కార్మికుల హక్కుల సాధన కోసం రాజకీయాలకతీతంగా కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు కొడాలి రామకోటేశ్వరరావు,ఎఐటియుసి నాయకులు బండారు శ్రీనివాసరావు,కన్నెగంటి రమేష్,చేనేత కార్మిక సంఘం నాయకులు కె.మోహన్‌రావు,బి.సుబ్బారావు,వి.శ్రీనివాసరావు,దీపాల సాంబశివరావు,ఓబులశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్నపిల్లలకు సరైన పోషకాహారం అందించాలి

**నగరం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాలలోనే చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం, చిన్నారులకు ఆరోగ్య భద్రత లభిస్తాయని సీడీపీవో ఎం.సుచిత్ర అన్నారు. నగరం మండలం చినమట్లపూడి అంగన్‌వాడి కేంద్రంలో 8వ పోషణ పక్వాడా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. పిల్లలు తొలి ఆరు సంవత్సరాలు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా 0-2 సంవత్సరాల వయస్సులో పిల్లల మెదడు అభివృద్ధిలో సుమారు 80 శాతం వరకు జరుగుతుందని, ఈ దశలో సరైన పోషకాహారం, ప్రేమతో కూడిన సంరక్షణ, మరియు సరైన మార్గదర్శకత్వం అవసరమని వివరించారు. పిల్లలకు మొబైల్ ఫోన్లు, టీవీ వంటి స్క్రీన్ టైమ్‌ను తగ్గించాలని సూచిస్తూ, అవి పిల్లల మానసిక మరియు శారీరక అభివద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. పిల్లలతో ఆడటం, మాట్లాడటం, కథలు చెప్పడం వంటి మంచి అలవాట్లు పెంపొందించాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ప్యాకేజ్డ్ జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు కలిగిన ఆహారాలు హైపర్‌టెన్షన్, డయాబెటిస్, జీర్ణ సమస్యలు , చెడు ప్రవర్తనా సమస్యలకు దారితీస్తాయని చెప్పారు. అందువల్ల స్థానికంగా లభించే సంప్రదాయ పోషకాహారం తీసుకోవాలని ప్రజలకు సూచించారు. మెడికల్ ఆఫీసర్ డా. రత్నకుమారి గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించి, తల్లుల ఆరోగ్యం మరియు శిశు సంరక్షణపై అవగాహన



కల్పించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డా.రత్నకుమారి, పీడియాట్రిషన్ డా.మధుసూధన్ రావు, డెంటిస్ట్ డా.యామినీ ప్రియా, ఫిజియోథెరపిస్ట్ సరళ, జనరల్ వైద్యులు డా. సంతోష్, డా. చైతన్య, ఆయుర్వేద వైద్యురాలు డా. మాధురి, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్పీ-సంపర్క్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ

**గుంటూరు క్రైమ్,ఏప్రిల్10,ప్రభాతవార్త:** "ఎస్పీ - సంపర్క్" కార్యక్రమం ద్వారా పోలీస్ సిబ్బంది తమ సమస్యలు,వినతులను నేరుగా ఫోన్ ద్వారా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కానిస్టేబులరీ సిబ్బందితో సమన్వయం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించబడింది. వాటిలో భాగంగా ఎస్పీ - సంపర్క్" కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో, గుంటూరు జిల్లా పోలీస్ పరిధిలో పనిచేస్తున్న కానిస్టేబులరీ సిబ్బంది తమ సమస్యలు,వినతులను నేరుగా జిల్లా ఎస్పీకి తెలియజేసేందుకు ప్రతి శుక్రవారం నిర్వహించబడే "ఎస్పీ - సంపర్క్" కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభ దశలోనే పలువురు సిబ్బంది ఫోన్ ద్వారా తమ వినతులను తెలియజేశారు."ఎస్పీ - సంపర్క్" కార్యక్రమం ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడుతుంది. గుంటూరు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది తమ సమస్యలు,వినతులను 8688831470 ఫోన్ నంబర్ ద్వారా నేరుగా తెలియజేయవచ్చని సూచించారు. విధుల నిమిత్తం జిల్లా పోలీస్ కార్యాలయానికి హాజరుకాలేని సిబ్బందికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లు, హోం గార్డులు పాల్గొనవచ్చు. సిబ్బంది తమ సర్వీస్‌కు సంబంధించిన సమస్యలు (పోస్టింగులు, లీవులు, వెల్ఫేర్, విధుల్లో ఒత్తిడి, మెడికల్ రీయింబర్స్‌మెంట్, బదిలీలు), విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు, డ్యూటీ అవర్స్, వ్యక్తిగత/కుటుంబ సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన సూచనలు తెలియజేయవచ్చు. శుక్రవారం కార్యక్రమంలో లాలాపేట హెడ్ కానిస్టేబుల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్, పొన్నూరు టౌన్ కానిస్టేబుల్ ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేశారు. జిల్లా ఎస్పీ వాటిని శ్రద్ధగా వినిపించి, తగిన చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ సిబ్బంది సమస్యలను నేరుగా వినిపించుకోవడం, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడం సాధ్యమవుతుందని, తద్వారా సిబ్బంది సంక్షేమం, సేవా ప్రమాణాల మెరుగుదలకు ఇది దోహదపడుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# ఘనంగా చిప్స్ కళాశాల వార్షికోత్సవం

**గుంటూరు విద్య ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** నగరంలోని చేబ్రోలు హనుమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ , 21వ వార్షికోత్సవ వేడుకలను ఏప్రిల్ శుక్రవారం చిప్స్ కళాశాల క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటి మరియు చిప్స్ కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు డా. రాయపాటి శైలజ , అలాగే విశిష్ట అతిథిగా ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. చదలవాడ అమూల్య మరియు గౌరవ అతిథిగా డిప్యూటీ డైరెక్టర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ఆంధ్రప్రదేశ్



శ్రీ కోట అనిల్ కుమార్ విచ్చేశారు, ఈ సందర్భంగా అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్ ప్రసంగిస్తూ మన కాలేజీ స్థాపించినప్పటి నుండి విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ధ్యేయంగా పెట్టుకున్నాము. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మన విద్యా విధానాన్ని నిరంతరం మెరుగుపరుస్తున్నాము. విద్యార్థుల ప్రయోగాత్మక అభ్యాసం కోసం అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీలు మరియు పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేశాము. కాలేజీని ఒక ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా మార్చడమే మా సంకల్పం. మా కళాశాల విద్యార్థులు కేవలం పట్టభద్రులుగా మాత్రమే కాకుండా, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన నిపుణులుగా ఎదగాలి. అందుకే టాప్ కంపెనీలతో టైఅప్ అయ్యి, విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాము అని తెలిపారు. తదుపరి కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ సి.ఎన్. శ్రీనివాస్ కాలేజీ వార్షికోత్సవం సందర్భంగా కాలేజీ వార్షిక నివేదిక మరియు అభివృద్ధిని ఉద్దేశించి చేసే ప్రసంగం లో "ఈరోజు మన విద్యాసంస్థ 21వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. డాక్టర్ విద్యాధర 2025లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భాన్ని మరియు కళాశాలకు వచ్చిన గుర్తింపును వివరించడం జరిగింది. తమ కాలేజీ విద్యార్థులు ప్రతి ఏడాది అద్భుత ఫలితాలు సాధిస్తూ, సుమారు 100 ఉత్తీర్ణతతో ప్రత్యేకతను కొనసాగిస్తోంది. మన అధ్యాపకులు-విద్యార్థులు కలిసి ఈ ఏడాది అంతర్జాతీయ జర్నల్స్‌లో 35 పరిశోధనా పత్రాలు ప్రచురించి, 5 పేటెంట్లు సాధించడం అభినందనీయం మరియుఅత్యాధునిక ల్యాబ్లు, డ్రగ్ టెస్టింగ్ లాబరేటరీ ఆమోదంతో కాలేజీ పరిశోధనా కేంద్రంగా రూపుదిద్దుకోగా, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి"బెస్ట్ లాబొరేటర్థీ అవార్డు లభించింది. ట్రైనింగ్ ప్లేస్మెంట్ సెల్ ద్వారా 90 మంది విద్యార్థులు ప్రముఖ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు; నైపుణ్యాభివృద్ధికి నిరంతర ప్రోత్సాహం అందుతోంది. విళీళీ ద్వారా రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, వృక్షారోపణలతో విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందుతోంది" అని తెలియజేశారు.

అనంతరం కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర వార్షిక నివేదిక సమర్పణలో భాగంగా మాట్లాడుతూ బి.ఫార్మసీ మరియు ఎం.ఫార్మసీ విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలు, యూనివర్సిటీ ర్యాంకుల వివరాలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు ప్రచురించిన అంతర్జాతీయ పరిశోధనా పత్రాలు గురించి, మరియు ప్రముఖ ఫార్మా కంపెనీలలో విద్యార్థులు సాధించిన ఉద్యోగ అవకాశాలు మరియు జిప్యాట్లో సాధించిన ఉత్తమ ర్యాంకులు తెలియజేసారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచేసిన శ్రీ కోట అనిల్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ఆంధ్రప్రదేశ్, మాట్లాడుతూ "మందుల తయారీ, పంపిణీ, మరియు వినియోగంలో నైతిక ప్రమాణాలు పాటించడం అత్యంత అవసరం. మీరు భవిష్యత్తులో ఈ రంగంలో నిబద్ధతతో పనిచేయాలి" అని విద్యార్థులను ప్రేరేపించారు. ఫార్మసీ విద్య ఫార్మసీ అంటే కేవలం మందులు అమ్మడం లేదా తయారు చేయడం కాదు. ఇది మానవాళి ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఒక పవిత్రమైన వృత్తి. మీరు చదివే చదువులో మందుల నాణ్యత, స్వచ్ఛత మరియు సామర్థ్యం పై పూర్తి అవగాహన పెంచుకోవాలి. మారుతున్న కాలంతో పాటు కృత్రిమ మేధ మరియు అధునాతన ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలను నేర్చుకోండి. అలాగే మీరు ఫార్మసిస్టులుగా, సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో పనిచేయండి. నైతికత ను మర్చిపోవద్దు. అవకాశాలు చాలా ఉన్నాయి, కానీ మీ నైపుణ్యమే మిమ్మల్ని నిలబెడుతుంది. మీరు రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ఫార్మా రంగాన్ని ఉన్నత స్థానంలో నిలబెడతారని ఆశిస్తున్నాను" అని ఉద్బోదించారు.

ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు డా రాయపాటి శ్రీనివాస్ , కార్యదర్శి డా సి ఎన్ శ్రీనివాస్ , కోశాధికారి శ్రీ రాయపాటి గోపాలకృష్ణ మరియు ఇతర పాలక వర్గ సభ్యుల చేతులు మీదుగా విద్య మరియు క్రీడా రంగాలలో ఉన్నత ప్రతిభ కబరిచిన విద్యార్థులకు అలాగే అధ్యాపకులకు బహుమతి ప్రదానం చేయడం జరిగింది.

# ఆలయ హుండీ లెక్కింపు

**కాకుమాను ఏప్రిల్ 10(ప్రభాతవార్త ) :** ంండల పరిధి కొండపాటూరు గ్రామంలో స్వయం భూదేవి శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళ 3 రోజుల హుండీలను దేవాదాయ ఏసీ,ఇన్స్పెక్టర్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం.



వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో గురువారం లెక్కించ్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జక్కా. శ్రీనివాసరావు తెలిపారు. ఈ లెక్కింపులో రూ.15,84,532 /ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం రూ. 15,56,256/ వచ్చింది అని. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ. 28,276/రూపాయలు అదనంగా వచ్చినట్లు జక్కా. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు, బ్యాంకు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**కాకుమాను ఏప్రిల్ 10,(ప్రభాతవార్త )**

మండల పరిధిలోని బికే పాలెం గ్రామానికి చెందిన సున్యాల బుజ్జి కి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసినట్లుతెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు కవుల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న అభివృద్ధి పనుల గురించి కొనియాడారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించిన



ప్రతిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల. రామాంజనేయులు కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 8వ పోషణ పక్వాడ కార్యక్రమం

**కాకుమాను ఏప్రిల్ 10,(ప్రభాతవార్త :** మండల పరిధి అప్పాపురం య సి 1 సెంటర్ లో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం



నిర్వహించడం జరిగినదని మండల ఐ సి డి యస్ సూపర్ వైజర్ పి. వెంకాయమ్మ శుక్రవారం తెలిపారు .ఈ కార్యక్రమం లోవెంకాయమ్మ మాట్లాడుతూ తల్లి మరియు శిశు సంరక్షణ గురించి తెలిపి నారు. ఈ కార్యక్రమాని కి తల్లులు ,గర్భ వతులు, కిశోరి బాలికలు హాజరు అయినారు. ఆ గ్రామం లోనిఏ డబల్యూ డబల్యూ హాజరు అయినారు.

# రక్షణ బలగాల పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**విజయవాడ తూర్పు, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త) :** ఈ నెల 12న జరిగే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏపీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. ఈ నెల12వ తేదీ ఆదివారం విజయవాడలోని ఏడు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. సీడీఎస్‌కు 699 మంది, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు 2,101 మంది మొత్తం 2,800 అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సీడీఎస్‌కు సంబంధించి ఉదయం 9 గం. నుంచి 11 గం. వరకు, మధ్యాహ్నం 12.30 గం. నుంచి 2.30 గం. వరకు, సాయంత్రం 4 గం. నుంచి 6 గం. వరకు మూడు దశలుగా పరీక్షలు జరుగుతా యన్నారు. భద్రతకు సంబంధించి పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వేసవి నేపథ్యంలో అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ప్రేమ్ కుమార్ లకావత్, యూపీఎస్సీ తనిఖీ అధికారి సుమిత్ వర్మ, డీఆర్‌వో ఎం. లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్‌డీవో టీవీ సతీష్ పాల్గొన్నారు.

# పన్ను రాయితీకి ఈ నెల 30 వరకే గడువు



**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** పన్ను రాయితీకి ఈ నెల 30 వరకే గడువని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. పన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉన్న పన్ను బకాయిలను ఏక మొత్తంలో చెల్లించి 50 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చని అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, చెల్లించి 5 శాతం రాయితీని పొందవచ్చని ఈ అవకాశం ఏప్రిల్ 30 వరకు మాత్రమేనని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజల సౌకర్యార్థం పన్ను చెల్లింపు కేంద్రాలు సెలవు దినాల్లో కూడా అందుబాటులో ఉంచుతున్నామని ఈ సందర్భంగా కమీషనర్ పేర్కొన్నారు.

# విద్య ద్వారా సమాజ మార్పుకు నాంది

## - పూలే దంపతుల సూత్రం ఇదే - ఏఎన్‌యులో పూలే ద్విశతాబ్ది జయంతోత్సవాలు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్10, ప్రభాతవార్త: విద్య, సమానత్వానికి జ్యోతిరావు పూలే దంపతులు అవిరళ కృషి చేశారని ఏఎన్‌యు వీసి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఏఎన్‌యులో మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో భాగంగా పూలే విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభకు మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న వీసి గంగాధరరావు మాట్లాడుతూ సమానత్వం, మహిళా విద్య, కులవ్యవస్థ నిరఉూలన కోసం నిరంతరం కృషిచేశారని కొనియాడారు. వారి ఆలోచన విధానాన్ని నేటితరం యువత అమల్లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కీలకోపన్యాసకులుగా పాల్గొన్న ఎస్‌కెడి యూనివర్సిటీ పరీక్షల డీన్ ఆచార్య జి.వి.రమణ మాట్లాడుతూ పూలే దంపతుల ప్రభావం భారతీయ సమాజంపై విశేషంగా ఉందన్నారు. వారి విద్యా ఉద్యమం సామాజిక న్యాయం సాధనలో కీలకమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను, సాంఘిక దురాచారాలను రూపుమాపడం కోసం పూలే తన జీవితాన్నే ధారపోశారన్నారు. పూలే భౌతికంగా లేకపోయినా ఆయన మార్గంలో మనం పయనిస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న బిఎస్‌ఎన్‌ఎల్ మాజీ డివిజినల్ ఇంజనీర్ అఖిల భారత ప్రగతిశీల వేదిక జాతీయ కార్యదర్శి సంగిరెడ్డి హనుమంత రెడ్డి పూలే దంపతులు విద్య ద్వారా అణగారిన వర్గాలకు శక్తివంతం కల్పించి సమాన అవకాశాలను అందించారని వివరించారు. మహిళా అణచివేతను వ్యతిరేకించి సమాజంలో సమానత్వం కోసం కృషిచేశారని దేశంలో పూలే దంపతులు మహిళావిద్యకు మార్గదర్శకులు అని కొనియాడారు. ఆచార్య త్రిమూర్తిరావు మాట్లాడుతూ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ద్విశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బ్రేకింగ్ బారియర్స్: ది ఇన్‌స్పైరింగ్ జర్నీ ఆఫ్ మహాత్మా జ్యోతిరావు పూలే అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో




ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఆచార్య తేజోమూర్తి, నూటా అధ్యక్షుడు ఆచార్య బ్రహ్మాజీరావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్యతేజోమూర్తి, లైబ్రేరియన్ ఆచార్య వెంకట్రావు, అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్, సిడిఇ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్ డా.భవాని, జగ్జీవన్‌రాం చైర్ కోఆర్డినేటర్ ఆచార్య పి.జె.రత్నాకర్‌లు ప్రసంగించారు. సిఇ శివప్రసాదరావు, సిఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బబిత, విభాగం ప్రోగ్రామర్ డాక్టర్ బి.కోటీయాదవ్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్‌కు సహకరించండి

## -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ నూరుశాతం పూర్తి అయ్యేందుకు రాజకీయ పార్టీల నాయకులు కూడా సహకరించాలని తహశీల్దార్ మహమ్మద్



జియావుల్ హక్ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభమవుతుందన్నారు. ప్రస్తుతం ప్రీ రివిజన్ ప్రస్తుతం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఎస్ఐఆర్ మ్యాపింగ్ నియోజకవర్గస్థాయిలో 56.79శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. పొన్నూరు రూరల్‌లో-58,57, అర్బన్‌లో-53.79, చేబ్రోలులో-59.32, పెదకాకానిలో-55.48శాతం పూర్తి అయినట్లు చెప్పారు. నియోజకవర్గం మొత్తం మీద 932 డబుల్ ఎంట్రీలను గుర్తించినట్లు చెప్పారు. వాటిపై త్వరలో చర్యలు తీసుకొంటామన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ సమావేశంలో చేబ్రోలు తహశీల్దార్ కళ్ళం శ్రీనివాసశర్మ, తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ ఆలేటి మాధవి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నల్లపు మౌనిక, కంప్యూటర్ ఆపరేటర్లు సయ్యద్ లాల్, షేక్ సిరాజుద్దీన్, నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బండబ్లమూడిబాబూరావు, గోపిశెట్టి వాసు, కలపాల శ్రీనివాసరావు, అందె దిలీప్ తదితరులున్నారు.

# వైకాపా పట్టణాధ్యక్షుడిగా షేక్ నాజర్



**పొన్నూరు, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** ఎట్టకేలకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన షేక్ నాజర్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు ఒక సంవత్సరం నుంచి పట్టణ పార్టీ అధ్యక్షుడి నియామకం ఖాళీగా ఉంది. షేక్ నాజర్‌ను నియమించడంతో పట్టణాధ్యక్షుడి పదవి భర్తీ అయింది. షేక్ నాజర్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉండడం, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తుండడంతోపాటు పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమానికి హాజరవుతుండడంతో నాజర్ నియామకం సులభమైనట్లు తెలుస్తుంది. నూతనంగా అధ్యక్షుడిగా నియమితులైన షేక్ నాజర్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించినందుకు శక్తివంచన లేకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డికి, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుకు, సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

# 12 శాఖల అధికారులతో బ్లాక్‌స్పాట్‌లను పరిశీలించిన సిపి,జిల్లా కలెక్టర్

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశమున్న 123 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా విన్నూత్న బస్సు ప్రయాణ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా సిపి రాజశేఖరబాబు శ్రీకారం చుట్టారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ లక్ష్మీశా నేతృత్వంలో రాష్ట్రం లోనే తొలిసారిగా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా 12 శాఖల అధికారులతో

**-40 కిలోమీటర్ల మేరకు బ్లాక్‌స్పాట్స్ పరిశీలన బస్సుయాత్ర**
**-123 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామన్న సిపి రాజశేఖరబాబు**
**-బ్లాక్‌స్పాట్‌లలో మౌలిక సదుపాయలను మెరుగుపరుస్తామన్న కలెక్టర్ లక్ష్మీశా**

ప్రత్యేకంగా బ్లాక్ స్పాట్‌లను పరిశీలించామన్నారు. ఈ బస్సు యాత్రను సిపి రాజశేఖరబాబు ప్రారంభించారు. ఈ యాత్ర కేతనకొండ నుండి ఎనికేపాడు వరకు (28 ప్రమాదకర ప్రాంతాల పరిశీలన)40 కి.మీల మేర బ్లాక్ స్పాట్ పరిశీలన బస్సు యాత్ర సాగింది. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణపై సమగ్ర కార్యాచరణను అమలు చేసే నేపథ్యంలో



ఎన్టీఆర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను రక్షించాలనే ధ్యేయంతో రాష్ట్రం లోనే తొలిసారిగా బ్లాక్ స్పాట్స్ పరిశీలనా బస్సు యాత్రను సంబంధిత అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో ఎన్టీఆర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో 453 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారన్నారు. 2025వ సంవత్సరంలో ఆ సంఖ్య 378కి తగ్గిందన్నారు. పలు అవగాహనా కార్యక్రమాల వల్ల గత సంవత్సరం 75 రోడ్డు ప్రమాద మరణాలు తగ్గించగలిగామన్నారు. 2026 సంవత్సరంలో మరణాల సంఖ్యని ఇంకా తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని, వెస్ట్ బైపాస్ అందుబాటులోకి రావడం వల్ల ట్రాఫిక్ తగ్గినా, వేగం వల్ల ప్రమాదాలు పెరిగాయన్నారు. ద్విచక్ర వాహనదారులలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయారన్నారు. గత మూడు సంవత్సరాల డేటా ఆధారంగా చేసుకొని 123 బ్లాక్ సా ఊపట్స్‌ను గుర్తించామన్నారు. ఈ 123 బ్లాక్ స్పాట్స్‌లో ప్రమాదాల తీవ్రతను తగ్గించాలనే ఉద్దేశ్యంతో చర్యలు చేపట్టామని, నేడు 28 బ్లాక్ స్పాట్స్‌ను సందర్శించి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, విఎంసి కమీషనర్ ధ్యానచంద్ర, నేషనల్ హైవే అథారిటీ పిడితో చర్చించామని, 'అస్త్రం' టీం కూడా ఈ 28 ప్రాంతాలను పరిశీలించి కొన్ని సలహాలిచ్చారన్నారు. దేశంలోనే తొలిసారిగా సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం హిట్ అండ్ రన్ కేసుల భాధితులకు ఆర్థిక సహాయం అందే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే 281 మంది భాధితులకు రూ.2కోట్ల 27 లక్షల50 వేలు ఇప్పించామని పేర్కొన్నారు. యాక్సిడెంట్స్ తగ్గించాలంటే ప్రజల సహకారం కూడా చాలా అవసరమని, హెల్మెట్, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇప్పటి వరకు అవగాహన కల్పించేలా ప్రాధాన్యతనిచ్చామని, ప్రజల్లో నిర్లక్ష్య ధోరణి తగ్గి అందరూ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాణాలు పోయాక భాధ పడేకన్నా...ముందే నిబంధనలు పాటించాలని కోరుతున్నామన్నారు. ప్రతి ప్రాణం విలువైందని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం జరుగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి జరిమానాలు విధిస్తున్నామని, అలాగే రోడ్డు ప్రమాదాల విశ్లేషణ కోసం ఆధునిక నిఘా కెమేరాల ద్వారా ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ రోడ్డు భద్రత కోసం సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర ప్రణాళికలతో చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అవగాహన కల్పించారు. త్వరలోనే బ్లాక్‌స్పాట్‌లలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చనున్నట్లు, ప్రమాదాలను తగ్గించే దిశగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ బస్సు యాత్ర ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధి లోని కేతన కొండ గ్రామం వద్ద ప్రారంభమై కేతనకొండ, మూలపాడు, కిలేశ్వరం, జూపూడి, నిమ్రా కళాశాల, ఇబ్రహీంపట్నం రింగ్, తుమ్మలపాలెం, గుంటుపల్లి, గుంటుపల్లి డాన్ బాస్కో స్కూల్, సూరయపాలెం, ఖలీల్ డాబా సెంటర్, ఎస్ఎస్ఎస్ కాలని, వై జంక్షన్, ఆంధ్ర హాస్పటల్, వెంకటేశ్వర ఫౌండ్రి, స్వాతి సెంటర్, కనకదుర్గ ఫ్లై ఓవర్ ఎంట్రీ, బస్టాండు, అమెరికన్ ఆస్పత్రి, నేతాజీ బ్రిడ్జి జంక్షన్, గీతానగర్ కట్ట జంక్షన్, స్క్రూ బ్రిడ్జి, బెంజి సర్కిల్, నోవాటెల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగు, శక్తి కళ్యాణ మండపం, 24కె ఫంక్షన్ హాల్ మొదలైన 28 అత్యంత ప్రమాదకరమైన 28 ప్రాంతాలను (బ్లాక్‌స్పాట్)లను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర, ట్రాఫిక్ డిసిపిలు షిరీన్ బేగం, ఎన్. సూర్యచంద్రరావు, నేషనల్ హైవే అథారిటీ పిడి విద్యాసాగర్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, విఎంసి, రెవిన్యూ, ఆర్ అండ్ బి అధికారులు, ఎన్‌జిఓ వాసు, ట్రాఫిక్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మొగులూరు ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల



**కంచికచర్ల ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** కంచికచర్ల మండల పరిధిలోని మొగులూరు గ్రామంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, అధికారులు, కూటమి నేతలతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించగా, గ్రామస్తులు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వేసవికాలంలో తాగునీటి సమస్యలు రాకుండా, నియోజకవర్గ పరిధి ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను తంగిరాల సౌమ్య ఆదేశించారు. వేసవి కాలంలో నీటి కొరత ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం దొనబండ కీసర ఆర్ అండ్ బి ప్రధాన రహదారి నిర్మాణం కోసం 1,500000/- 1 కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రధాన రహదారికి శంకుస్థాప చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు, కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్, కూటమి నేతలు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

11-4Pg7exHMNWJQE 11_11-4Pg7exHMNWJQE.qxd 10/Apr/26 11:54 PM Page 1



## కుటుంబ కలహాలతో అత్తను చంపేశాడు



కొయ్యలగూడెం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం పరిధిలోని తారక రామానగర్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, అను మానం ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. తన భార్యను కాపురానికి పంపడం లేదన్న కోపంతో, మద్యం మత్తులో ఉన్న అల్లుడు కన్నతల్లి లాంటి అత్తను కత్తితో పొడిచి అతి దారుణంగా హత్య చేశాడు. ఘటన వివరాల్లోకి వెళ్తే స్థానిక తారకరామానగర్‌కు చెందిన పోల మంగమ్మ (68), ఆమెకు 8 మంది సంతానం అందులో ఐదుగురు కొడుకులు ముగ్గురు కుమార్తెలు వారిలో రెండవ కుమార్తె భర్త అయిన కేదారి పుల్లయ్యకు అత్త పోలా మంగమ్మకు మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసైన పుల్లయ్య ప్రవర్తన నచ్చక అతని భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. అయితే, తన భార్య కాపురానికి రాకుండా అత్త మంగమ్మ అడ్డుపడుతోందని, ఆమె తన భార్యను తప్పుదోవ పట్టిస్తోందని పుల్లయ్య గట్టిగా నమ్మాడు. అత్తను చంపితేనే తన భార్య తిరిగి వస్తుందని పథకం వేశాడు. ఈ క్రమంలో, అర్ధరాత్రి సమయంలో మంగమ్మ నిద్రిస్తుండగా పుల్లయ్య కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావమై మంగమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు.

**పోలీసుల దర్యాప్తు:** ఘటనపై సమాచారం అందుకున్న కొయ్యలగూడెం ఎస్సై చంద్రశేఖర్ సిఐ బాల సురేష్ తమ సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. నిందితుడు కేదారి పుల్లయ్యపై కేసు నమోదుచేశారు, త్వరలోనే అతడిని పట్టుకుంటామని సిఐ బాలసురేష్ మీడియాకు వెల్లడించారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు ప్రధాన కారణమని తెలిపారు.

## యువ న్యాయవాది అనుమానాస్పద మృతి



గుంటూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: పల్నాడు జిల్లా చిలకలూరి పేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యడ్లవల్లిలో ఒంగోలుకు చెందిన యువ న్యాయవాది శ్రీరామ్ హరి ప్రసాద్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రోడ్డు పక్కన హరి ప్రసాద్ మృతదేహంపై స్కూటీ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహంపై స్కూటీ పడినట్టుగా ఉండటంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద స్థలంలో బండరాళ్లతో కొట్టిచంపినట్టు పోలీసులు గుర్తించారు. హరిప్రసాద్ 2018లో న్యాయవాదిగా ఒంగోలులో ప్రాక్టీస్ ప్రారంభించారు. వీరి కుటుంబం ప్రస్తుతం ఒంగోలులో ఉంటోంది. యువకుడి తల్లి ఒంగోలు జిల్లా కోర్టులో పనిచేస్తున్నారు. గరువారం సాయంత్రం హైకోర్టు పని మీద బయటకు వెళుతున్నానని తల్లి తిరుపతమ్మకు చెప్పి ఒంగోలు నుండి బయలుదేరిన వ్యక్తి ఉదయానికి చనిపోయినట్లు కోడలుకు ఫోన్ వచ్చిందని తల్లి కన్నీరు మున్నీరయ్యారు. ఎక్కడో చంపి యడవల్లి వద్ద తన కొడుకును పడేశారని, తన కొడుకుది ముమ్మాటికీ హత్యే అని తల్లి తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే హరిప్రసాద్ వివాదాలు జోలికి వెళ్ళే వ్యక్తి కాదని, ఎవ్వరితో ఎటువంటి శతృత్వాలు లేవని చెబుతున్నారు. ఈ క్రమంలో హరిప్రసాద్ మరణం ప్రమాదం వల్ల జరిగిందా లేక హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హీల్‌లో 11వ తరగతి ప్రవేశాలకు ప్రకటన

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, వసతి, భోజనం అందించే హీల్ ప్యారడైజ్ పాఠశాలలో 11వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హీల్ సిఇఓ కె.అజయ్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో 90 ఎకరాల సువిశాల ప్రాంగణంలో డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆంగ్ల మాధ్యమంలో ఎంపిసి, బైపిసి, ఎంఇఎ గ్రూపుల్లో 2026-27 విద్యా సంవత్సరం ప్రవేశాలకు హీల్ ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత తప్పనిసరి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతిలో 480 మార్కులు, సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ విద్యార్థులు 400 పైన మార్కులు సాధించి ఉండాలి. తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం తప్పనిసరి అని విజయ్ కుమార్ వివరించారు. ఈ అర్హతలు ఉన్నవారు మే 18లోపు క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 91000 24438, 91000 24435 నంబర్లలో సంప్రదించవచ్చు.

## ఆయుష్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి ఆయుష్ విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి మెంబర్ సెక్రటరీ శుక్రవారం ఒక పర్యటనలో తెలిపారు. విజయవాడలోని ఆయుష్ శాఖ కమిషనర్ నియంత్రణలో గల వివిధ ప్రభుత్వ కళాశాలల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. మొత్తం 59ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల చేశామని, డాక్టర్ ఎన్‌ఆర్ఎస్‌జిఏసి, విజయవాడ, డాక్టర్ ఎఆర్‌జిహెచ్‌ఎంసి, రాజమండ్రి, డాక్టర్ జిజిహెచ్‌ఎంసి, గుడివాడ జిహెచ్‌ఎంసి, కడపలో పనిచేయవలసి ఉంటుందన్నారు. సంబం ధిత విభాగంలో అర్హత కలిగిన డిగ్రీ, పర్మనెంట్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ సర్టిఫికేట్ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు ఈ నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివారల కోసం పైన పేర్కొన్న అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చునని ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక మండలి మెంబర్ సెక్రటరీ ఆ ప్రకటనలో కోరారు.

## 18న కొండపల్లిలో హెరిటేజ్ ట్రెక్కింగ్



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ప్రపంచవారసత్వ దినోత్సం సందర్భంగా ఈనెల 18న విజయవాడ, కొండపల్లిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా హెరిటేజ్ ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ, ఎన్‌టిఆర్ జిల్లా యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికారసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్న కార్యక్రమాల వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. 18వ తేదీ ఉదయం 6గంటలకు కొండపల్లి ఖిల్లా పైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందన్నారు. క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మని, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ భాగస్వామ్యంతో విజయవాడలో హెరిటేజ్‌వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండపల్లిలో మూడురోజులపాటు కొండపల్లి బొమ్మలతో మేళా ఏర్పాటు చేస్తున్నామని, ఈనెల 8వ తేదీ నిర్వహించిన బొమ్మలపోటీలో విజేతలకు లక్షరూపాయల విలువచేసే బహుమతులు అందచేస్తామన్నారు. 18వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పక్కనే ఉన్న ఖాళీస్థలంలో సంగీతఝరితో వారసత్వానికి పట్టంకట్టే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నేపథ్య గాయకులు ఎస్‌పి చరణ్, సునీత, తదితరులు పాల్గొంటారని కలెక్టర్ వివరించారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇన్‌టాక్ విజయవాడ చాప్టర్ కన్వీనర్ సాయి పాపినేని, ఆర్‌టిహెచ్ విజయవాడ సిఇఓ జి.కృష్ణన్, జిల్లా పర్యాటక అధికారి ఏ.శిల్ప, కొండపల్లి బొమ్మల హస్తకళాకారుల సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# న్యాయ శాఖ పటిష్టత కోసం చర్యలు

**● మైనారిటీ సంక్షేమ శాఖ శాఖల మంత్రి ఫరూక్ ● పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ**



విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో న్యాయ శాఖ పటిష్టత కోసం ప్రణాళిక బద్ధ చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ శాఖల మంత్రి ఎస్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శుక్రవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. న్యాయ శాఖలో తప్పనిసరి వ్యాజ్యాలను తగ్గించడం సకాలంలో ప్రభావంత మైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం, పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానంపై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రుల విస్తృతంగా చర్చించారు. ఈ సంద ర్భంగా న్యాయశాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనవసరమైన వాజ్యాలను తగ్గించ డానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు. ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్ల న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలు కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించ డం, ప్రోత్సహించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్దంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎస్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, అనిత, సత్యకుమార్‌లు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.




# బిజెపి మరింత బలపడాలి

**● ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నబిన్‌తో మాధవ్ భేటీ ● ఎపి కార్యక్రమాలపై అభినందనలు, మాధవ్ కృతజ్ఞతలు**

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్, హస్తినాపురంలో జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను కలిసి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముందుగా అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన బస్సు యాత్రకు సంబంధించిన చిత్రమాలిక పుస్తకాన్ని నితిన్ నబిన్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమాలపై ఆయన అభినందనలు తెలియజేయగా, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాధవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భేటీలో రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తలతో సమన్వయం, రాబోయే కార్యక్రమాల అమలు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి 15 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను విస్తరించడమే లక్ష్యమని చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయడం, కొత్త సభ్యులను చేర్చడం వంటి కార్యక్రమాలు కూడా ఈ ప్రణాళికలో భాగంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంతో రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలకు మరింత ఉత్సాహం లభిస్తుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ జీ, జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ జీ, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతురమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రవేశద్వారం జగ్గయ్యపేటకు మహర్దశ

**● అమరావతి ఇండస్ట్రియల్ హబ్ తొలి నగరంగా జగ్గయ్యపేట ● విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్**



గౌతమ బుద్ధ ప్రతిమతో ఏర్పాటుచేసిన ప్రగతిపథం స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

జగ్గయ్యపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రవేశద్వారంగావున్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి మహర్దశ వచ్చిందని, అమరావతి ఇండస్ట్రియల్ హబ్ తొలి నగరంగా జగ్గయ్యపేట అవతరించబోతోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. జగ్గయ్యపేట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిదేందుకు డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎంఎఫ్) గ్రాంటు నుండి విడుదలైన రూ.7.15 నిధులతో పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గౌతమ బుద్ధ ప్రతిమతో ఏర్పాటుచేసిన ప్రగతిపథం స్తూపాన్ని, శిలాఫలకాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా తొలుత మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల మున్సిపల్ చరిత్రలో ఏ పాలకవర్గానికి లభించని కీర్తి తమను వరించిందన్నారు. వందల కోట్ల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి పర్చుకోవ టం గర్వకారణమన్నారు. ఆధునాతన రహదారుల నిర్మాణం, మురుగునీటి పారుదల కల్వర్టులు, ఆధునీకరణ, ప్రతి ఇంటికి మంచినీటి పంపు నూరుశాతం మౌళిక సదుపాయాల కల్పన కూటమి ప్రభుత్వంలో నేతలు ఎంపి శివనాథ్, ఎమ్మెల్యే రాజగోపాల్, కెడిసిసి చైర్మన్ రఘురామ్ సహకా రంతో అమలులోకి వస్తుండటం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఎంపి శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సిఎం చంద్రబాబు అహర్నిశలు పరిశ్రమిస్తున్నారన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రానికి భారీగా నిధులు సమకూర్చి దేశంలో రాష్ట్రాన్ని నెంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు కృషిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ పట్టణంలో మౌళిక సదుపాయాల కల్పనకు రూ.7.15 కోట్లు మంజూరు చేయటం ద్వారా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్ రఘురామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగుతుందన్నారు. యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ మాట్లాడుతూ విజయవాడకు సాటిగా జగ్గయ్యపేటలో అభివృద్ధి పనులు జరుగుతుండటం నాయకుల గొప్పతనానికి నిదర్శన మన్నారు. కాగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సచివాలయ సిబ్బంది ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నేతలు ఉద్యోగుల భద్రత, బంగారు భవిష్యత్తు గురించి వివరించి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమా ల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, నేతలు శ్రీరాం ధనుం జయ, నూకల కుమారరాజ, ధూళిపాళ లక్ష్మణరావు, మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, కట్టా వెంకట నరసింహారావు, కె కిషోర్, నజీమూన్, కౌన్సిలర్లు బుజ్జిబాబు, వెంకట్, సైదేశ్వరరావు, కంచేటి గీతారాణి, నాగ రాజు, వెంకట్రామయ్య, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి 47 అర్జిలను స్వీకరించారు.

# ఇంద్రకీలాద్రి కొండచరియల పటిష్టతపై ఎన్‌ఐఆర్‌ఎం అధ్యయనం



ఇఓతో ఎన్ఐఆర్ఎం బృందం సమావేశం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం వెలసిన ఇంద్రకీలాద్రి కొండ చరియల పటిష్టతపై ఎన్‌ఐఆర్‌ఎం (నేషనల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్) బృందం అధ్యయనం చేసేందుకు బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ నుండి సాంకేతిక బృందం శుక్రవారం దేవస్థానానికి చేరుకుంది. ప్రముఖ శాస్త్రవేత్త ప్రసన్న జైన్ నేతృత్వంలోని ఈ బృందం ఇఓ శీనా నాయక్‌ను కలిసి, క్షేత్రస్థాయి పరిశీలనపై కావలసిన ఏర్పాట్లు పై చెక్ లిస్ట్ సమర్పించి, చర్చించారు. కొండపై తరచుగా రాళ్లు జారిపడుతున్న ప్రాంతాలు, ప్రస్తుతం పటిష్టంగా ఉన్న రాళ్ల విస్తీర్ణం, మట్టితో మిళితమై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బృందం విశ్లేషించనుంది. భవిష్యత్తులో కొండపై నిర్మించతలపెట్టిన పాశుపతాల యం ప్రదేశం భూగర్భ పటిష్టతను, అలాగే 2వ ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఉన్న అనుకూల పరిస్థితులను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించనుంది. దేవస్థాన అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ అధ్యయన నివేదికను సిద్ధం చేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రతను నిర్ధారిం చడానికి, శాశ్వతమైన నిర్మాణాలను చేపట్టడానికి ఎన్‌ఐఆర్‌ఎం ఇచ్చే సాంకేతిక నివేదిక ఒక బ్లూ ప్రింట్ లాగా పనిచేస్తుంది. ఇది దేవస్థానానికి భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ కవచం లాంటిదని ఈవో పేర్కొన్నారు. ఈ బృందంతో సాంకేతిక సలహాదారు సుబ్రహ్మణ్యం, దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మ ఆలయంలో ఇఓ పలు విభాగాల తనిఖీ:** దుర్గమ్మవారి ఆలయంలో ఈవో వీకే శీనా నాయక్ వివిధ విభాగాలను శుక్రవారం తనికీ చేశారు. దేవాదాయ కమిషనర్ ఆదేశాల ప్రకారం రద్దీ సమయంలో భక్తులకు అందుబాటులో ఉంటే సమస్యలు తెలుస్తాయాన్న అభిప్రాయంతో అన్ని ప్రదేశాలు క్షుణ్ణంగా పరిశీలన చేశారు. దుర్గా స్నానఘాట్ నిత్యం పరిశుభ్రతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రేవు అంచుల్లో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. దుర్గా ఘాట్ నుండి కేశ ఖండనశాల వైపు ఉన్న అండర్ పాస్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, కేశ ఖండనశాలలో మరుగుదొడ్లు, స్నానాల గదుల్లో అన్ని ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది సిబ్బంది గమనించి, రిపేర్లు ఉంటే చేయించాలని ఆదేశించారు. అక్కడ నుండి కాలినడకన కొండపైకి చేరి, భక్తుల సౌకర్యార్థం ఘాట్ రోడ్‌లో ఈ టాయిలెట్స్ సంఖ్య పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బస్ షెల్టర్, ఓం టర్నింగ్ ఏరియాలో భక్తుల సౌకర్యార్థం అప్పటికప్పుడు కాయిర్ మ్యాట్ వేయించా రు. ఆలయం చుట్టూ వేస్తున్న చలువ పందిరి పరిశీలన చేసి ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ దుర్గారావు, సిఐ గుణరామ్, ఇంజినీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రవీంద్ర, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మవారి సేవలో మంత్రి వాసంశెట్టి:** దుర్గమ్మవారిని శుక్రవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ ఏఈవో అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాన్ని బహుకరించారు.

**శానిటరీ ఇన్‌స్పెక్టర్ తొలగింపు:** ఇంద్రకీలాద్రి కొండదిగువున శ్రీ కనకదుర్గానగర్ మరుగుదొడ్లలో గుర్తు తెలియని యాచకునిగా భావిస్తున్న వ్యక్తి మరణించిన సంఘటనలో విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రజినీ ప్రియను విధులు నుండి తాత్కాలికంగా తొలగించినట్లు ఇఓ వికె శ్రీనానాయక్ తెలిపారు.



# జులైలో అందుబాటులోకి భోగాపురం విమానాశ్రయం

**ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానికి ప్రభుత్వం ఆహ్వానం**

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జులై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

# రూ.9.36 లక్షల కోట్ల పెట్టుబడులు.. 9.62 లక్షల ఉద్యోగాలు

**- కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి**




విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం. సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపు. ఎపిఐఐసీ, టిసిఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఎపిఐఐసి, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం లభించినట్లు వివరించారు.

## అమరావతి 40ఏళ్ళయినా పూర్తి కాదు: సజ్జల

విజయవాడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తున్న ప్రాంతంలో రాజధాని అనేది 30-40 ఏళ్ల అయినా పూర్తి కాదని వైఎస్సార్‌సిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. దీనికి చత్తీస్‌గఢ్‌లో నిర్మించిన నవ రాయ్‌పూర్ ఉదాహరణ అని ఆయన తెలిపారు. నవ రాయపూర్‌లో బిల్డింగ్‌లు మాత్రమే ఉన్నాయని కానీ జనం లేరని సజ్జల పేర్కొన్నారు. “చంద్రబాబు లెక్కల ప్రకారమే అమరావతి రూ.2-3 లక్షల కోట్లు కావాలి. ఇప్పుడు కేవలం పనిచేసే ఉద్యోగులు ఉండడానికి మాత్రమే కడుతున్నాడు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిలు వీరికి బంగ్లాలు మాత్రం కడుతున్నాడు. రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లు డెవలప్ చేయాల్సి ఉంది. అది ఎప్పటికి అవుతుందో ఎవ్వరికీ తెలియదు. ఎలాంటి సౌకర్యాలు, సదుపాయాలు లేని చోట అంతంత డబ్బు పెట్టి ప్రజలు ఎలా ఉంటారు? జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రేట్లు పెట్టి ప్రజలు అక్కడికి ఎందుకు వస్తారు? ప్రజలు భరించలేని రేట్లతో ఏ సదుపాయాలూ లేనిచోట ఎందుకు ఉంటారు? మౌలిక సదుపాయాల కోసమే ఎన్ని లక్షల కోట్లు పెట్టాలి? ప్రజలు రాకుండా సిటీ ఎలా అవుతుంది“ అని వైఎస్సార్‌సిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.



## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. కేంద్ర మాజీ ఎన్నికల కమిషనర్ గోపాలస్వామి, క్రీడాకా రుడు పుల్లల గోపీచంద్, తెలంగాణ మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్, సింగర్ శ్రీకృష్ణ, వొజ్జల అద్వితీయ, అంబిక కృష్ణ, ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గ్రాండ్ ఫినాలేలో ‘మిస్ తెలుగు యుఎస్‌ఏ 2026’ కిరీటాన్ని గెలుచుకున్న అమూల్య బాల్మూరి



హైదరాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: గ్రాండ్ ఫినాలేలో ‘మిస్ తెలుగు యూఎస్‌ఏ 2026’ కిరీటాన్ని గెలుచుకున్న అముల్య బాల్మూరి కరీంనగర్‌కు చెందిన యువతి. గోల్డ్‌మన్ సాక్స్ ప్రొఫెషనల్ మరియు రచయిత్రి అయిన ఆమె, ఏప్రిల్ 4న జరిగిన గ్రాండ్ ఫినాలేలో 100 మంది పోటీదారుల నుండి ప్రత్యేకంగా పోటీలో నిలిచి టైటిల్‌ను గెలుచుకున్నారు. బి.శ్రీనివాస రావు (రిటైర్డ్, ఐ క్యాడ్ డిపార్ట్‌మెంట్), బి.రమల కుమార్తె అయిన అముల్య బాల్మూరి, మిస్ తెలుగు యూఎస్‌ఏ 2026 కిరీటాన్ని గెలుచుకున్నారు. ప్రస్తుతం టెక్సాస్‌లోని డల్లాస్‌లో నివసిస్తున్న అమూల్య, కరీంనగర్‌లోని చిట్యాలపల్లి గ్రామానికి చెందినవారు. ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆల్వాల్‌లో నివసిస్తున్నారు. భోజరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ నేపథ్యంతో తన విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించిన అమూల్య, ఆ తర్వాత మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి, ప్రస్తుతం గోల్డ్‌మన్ సాక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో విజయవంతమైన మార్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. రచనపై ఉన్న మక్కువతో ఆమె తన కథలను ఆన్‌లైన్‌లో ప్రచురిస్తూ, ప్రపంచవ్యాప్తంగా 90,000మందికి పైగా పాఠకులను సంపాదించుకున్నారు.

